


| | ఇఫ్తార్ | సెహరి |
|---|---|---|
| | సోమవారం | మంగళవారం |
| కర్నూలు | 6: 32 | 5:08 |
| నంద్యాల | 6: 29 | 5:07 |





టీడీపీ ఎమ్మెల్సీ అభ్యర్థుల ఎంపిక ఉత్కంఠ వీడింది. రాయలసీమ నుంచి జిల్లాకు చెందిన ఎమ్మెల్సీ బెందుల తిరుమల నాయుడు (బీటీ నాయుడు)కు అధినేత, ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు మరో చాన్స్ ఇచ్చారు. ఉమ్మడి కర్నూలు జిల్లా నుంచే కాక.. రాయలసీమ జిల్లాల నుంచి సీనియర్ నేతలు, రాజకీయ ఉద్దండులు పోటీ పడినా.. చంద్రబాబు విశ్వసనీయతకు పట్టం కట్టారు. ఎమ్మెల్యే కోటా కింద టీడీపీ ఎమ్మెల్సీ అభ్యర్థులను ఆదివారం సీఎం చంద్రబాబు ప్రకటించారు. ముగ్గురు జాబితాలో బీటీ నాయుడు పేరు ఉండడంతో ఆయన వర్గీయులు, టీడీపీ శ్రేణులు ఆనందంతో సంబరాలు చేసుకున్నారు. చంద్రబాబు, యువనేత లోకేశ్ నిజాయితీ, నమ్మకం, విశ్వసనీయతకు పట్టం కట్టారు అంటూ బీటీ నాయుడు అనుచరులు హర్షం వ్యక్తం చేశారు.



# విశ్వసనీయతకు పట్టం

- ఎమ్మెల్యే కోటాలో ఎమ్మెల్సీ అభ్యర్థిగా బీటీ నాయుడుకు మరో అవకాశం
- అధినేత చంద్రబాబు, యువనేత లోకేశ్‌తో అనుబంధం
- సీమ జిల్లాల నుంచి బీటీకి చాన్స్
- నేడు నామినేషన్ దాఖలు
- హర్షం వ్యక్తం చేస్తున్న బీటీ అభిమానులు, టీడీపీ శ్రేణులు

కర్నూలు, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): కోసిగి మండలం జుమాలదిన్నె గ్రామానికి రైతు దంపతులు బుడ్డన్న, అయ్యమ్మ కుమారుడు బీటీ నాయుడు. ప్రాథమిక విద్య స్వగ్రామంలోనే పూర్తి చేసిన ఆయన 8-10వ తరగతి వరకు ఆదోని వైఎంకే స్కూల్, ఇంటర్మీడియట్ ఆదోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో పూర్తి చేశారు. తిరుపతి ఎస్వీ విశ్వవిద్యాలయంలో ఐదేళ్ల న్యాయ విద్య పూర్తి చేశారు. కాకతీయ విశ్వవిద్యాలయంలో ఎంఏ పట్టా అందుకున్నారు. ఉస్మానియా యూనివర్సిటీలో జర్నలిజం పీజీడీసీ పూర్తి చేశారు. ఎమ్మిగనూరు, ఆదోని, కర్నూలు కోర్టుల్లో న్యాయవాదిగా ప్రాక్టీస్ ప్రారంభించారు. విద్యార్థి దశలో ఎస్ఎఫ్ఐలో కీలకంగా పని చేస్తూ రాజకీయాల పట్ల మమకారం పెంచుకున్నారు. 1997లో వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చాలనే ఉద్యమంలో అడుగు పెట్టారు. అంచెలంచెలుగా ఉద్యమంలో ఎదిగారు. వాల్మీకి సింహగర్జన పేరుతో సీమ జిల్లాల్లో వేలాది సమీకరించి సభలు నిర్వహించారు. బీసీ, దళిత హక్కుల సాధన ఉద్యమాల్లో పని చేశారు. ప్రజా సంఘాల్లో కీలకంగా పని చేసిన ఆయన రాజకీయాలపై ఉన్న మక్కువతో 1994లో నాటి ఆదోని ఎమ్మెల్యే కె. మీనాక్షినాయుడు నాయకత్వంలో క్రియాశీలక సభ్యత్వం తీసుకున్న బీటీ నాయుడు రాజకీయ మలుపులు దాటుకుంటూ టీడీపీ అధినేత చంద్రబాబు, యువనేత నారా లోకేశ్‌కు అత్యంత సన్నిహితుడు, నమ్మకస్తుడిగా ఎదిగారు. 30 ఏళ్ల టీడీపీ రాజకీయ ప్రస్థానంలో ఆదోని, మంత్రాలయం నియోజకవర్గాల ఇన్‌చార్జిగా, టీడీపీ రాష్ట్ర కార్యదర్శిగా, వివిధ జిల్లాల పార్టీ ఇన్‌చార్జిగా, పార్లమెంట్ నియోజకవర్గాల పార్టీ ఇన్‌చార్జిగా పని చేశారు. 2023 నుంచి 2024 ఏప్రిల్ వరకు టీడీపీ జిల్లా అధ్యక్షుడిగా పని చేశారు. అంతేకాదు.. కర్నూలు పార్లమెంట్ స్థానం నుంచి 2009, 2014లో రెండు పర్యాయాలు టీడీపీ ఎంపీ అభ్యర్థిగా పోటీ చేశారు. జిల్లా స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు పార్టీలో తనకుంటూ ఓ ప్రత్యేక స్థానం పదిలం చేసుకున్నారు. అధినేతకు చంద్రబాబుకు విశ్వసనీయుడిగా మారారు. అదే ఆయనను రాజకీయంగా ఉన్నత శిఖరాలకు చేర్చిందని ఆయన సన్నిహితులు పేర్కొంటున్నారు.

### ఎమ్మెల్సీగా మరో అవకాశం



2019 మార్చిలో జరిగిన ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ ఎన్నికల్లో టీడీపీ అధినేత, నాటి ముఖ్యమంత్రి చంద్రబాబు తొలిసారిగా బీటీ నాయుడుకు ఎమ్మెల్సీ అవకాశం ఇచ్చారు. రాయలసీమ జిల్లాల్లో బలమైన వాల్మీకి సామాజికవర్గం కోటాలో ఆయనకు అవకాశం దక్కింది. ఎమ్మెల్సీ పదవి దక్కినా.. పార్టీ అధికారం కోల్పోయి ప్రతిపక్షంలో కూర్చోవాల్సి వచ్చింది. ఆ సమయంలో శాసన మండలిలో బలం లేని వైసీపీ అధిష్ఠానం, నాటి సీఎం జగన్ బీటీ నాయుడిని వైసీపీలో చేర్చుకోవడానికి ఎన్నో ఎత్తులు వేశారు. భారీ ఆఫర్ కూడా ఇచ్చారనే ప్రచారం అప్పట్లో జరిగింది. అయితే.. నమ్ముకున్న టీడీపీ, అవకాశం ఇచ్చిన చంద్రబాబు వెంటే నడిచారు. శాసనమండలిలో టీడీపీ విధానాలు గట్టిగా వినిపించారు. టీడీపీ ఫ్లోర్ లీడర్, మండలిలో ప్రొటెక్షన్ చైర్మన్ హోదాలో మండలిని నడిపించారు. ఎన్నికలు దగ్గర పడుతుండడంతో 2023లో టీడీపీ కర్నూలు జిల్లా అధ్యక్ష బాధ్యతలు అప్పగించారు. ఆ సమయంలో పార్టీ బలోపేతం, యువనేత నారా లోకేశ్ పాదయాత్రను దిగ్విజయం చేయడంలో కీలకభూమిక పోషించారు. నంద్యాలలో చంద్రబాబు అరెస్ట్ సమయంలో అధినేతకు న్యాయపరంగా అండగా నిలిచారు. 53 రోజులు రాజమండ్రి జైల్లో ఉన్న సమయంలో కూడా డిల్లీ నుంచి వచ్చిన సీనియర్ న్యాయవాదులకు అధినేత చంద్రబాబుకు మధ్య సంధానకర్తగా పని చేశారు. ఎన్నికల ముందు రాజకీయ సమీకరణాల్లో భాగంగా టీడీపీ జిల్లా అధ్యక్ష పీఠం తిక్కారెడ్డికి ఇస్తామని అధినేత చంద్రబాబు చెబితే.. దానికి అంగీకరించారు. చంద్రబాబు, లోకేశ్‌లతో అంతటి నమ్మకాన్ని పెంచుకున్న బీటీ నాయుడికి అదే ఎమ్మెల్యేల కోటాలో ఎమ్మెల్సీగా మరోసారి అవకాశం దక్కడం కొసమెరుపు. జిల్లా నుంచి మాజీ మంత్రులు కేఈ ప్రభాకర్, ఏరాసు ప్రతాప్‌రెడ్డి సహా టీడీపీ జిల్లా అధ్యక్షుడు తిక్కారెడ్డి, ఆదోని ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే మీనాక్షినాయుడు.. ఇలా ఎందరో నాయకులు ఆశించారు. రాయలసీమ జిల్లాల నుంచి మహామహులు ప్రయత్నాలు చేశారు. సీమలో బలంగా ఉన్న వాల్మీకి సామాజికవర్గానికి చెందిన బీటీ నాయుడు వైపే అధినేత మొగ్గు చూపారు.

### అధినేత చంద్రబాబు నమ్మకాన్ని నిలబెడతాను

టీడీపీ అధినేత, ముఖ్యమంత్రి చంద్రబాబు, విద్యా, ఐటీ శాఖ మంత్రి యువనేత నారా లోకేశ్ నాపై ఎంతో నమ్మకంతో మరోసారి ఎమ్మెల్సీగా అవకాశం ఇచ్చారు. వారి నమ్మకాన్ని ఎట్టిపరిస్థితుల్లోనూ వమ్ము చేయను. టీడీపీని నమ్ముకున్న కార్యకర్తకు, అంకితభావంతో పని చేసిన వారికి పదవులు వస్తాయనడానికి ప్రత్యక్ష సాక్షిని నేను. నమ్మకం, నిజాయితీగా పని చేస్తే అధినేత, యువనేత ఇద్దరు కూడా కార్యకర్తలను గుండెల్లో పెట్టుకుంటారు. వారి రుణం జన్మతా తీర్చుకోలేనిది. ఎల్లప్పుడు నారా కుటుంబానికి రుణపడి ఉంటాను. నా 30 ఏళ్ల టీడీపీ రాజకీయ జీవితంలో ఏ బాధ్యత అప్పగించినా నిజాయితీగా నిర్వర్తించాను. నాకు సహకరించిన సీనియర్ నాయకులు, మాజీ డిప్యూటీ సీఎం కేఈ కృష్ణమూర్తి, ఉమ్మడి జిల్లా మంత్రులు టీజీ భరత్, ఎన్ఎండీ ఫరూక్, బీసీ జనార్దన్‌రెడ్డి, ఎంపీ, ఎమ్మెల్యేలు, టీడీపీ జిల్లా అధ్యక్షుడు పి. తిక్కారెడ్డి, ముఖ్యంగా నాకు రాజకీయ గురువు అయిన ఆదోని ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే కె. మీనాక్షినాయుడు, కుడా చైర్మన్ సోమిశెట్టి వెంకటేశ్వర్లు సహా సీనియర్ నాయకులు అందరికి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేస్తున్నాను.

\- బీటీ నాయుడు, ఎమ్మెల్సీ

### నేడు నామినేషన్ దాఖలు

ఎమ్మెల్సీ బీటీ నాయుడు పదవీ కాలం ఈ నెల 29తో ముగుస్తుంది. మళ్లీ అవకాశం రావడంతో మరో ఆరేళ్లు అంటే.. 2031 మార్చి 29 వరకు ఆయన ఎమ్మెల్సీగా కొనసాగే అవకాశం ఉంది. సోమవారం 11 గంటల సమయంలో శాసనమండలి సెక్రెటరీ జనరల్‌కు నామినేషన్ పత్రాలు అందజేస్తారు. ఆయన నామినేషన్ కార్యక్రమంలో పాల్గొనేందుకు సన్నిహితులు, అనుచరులు ఆదివారం రాత్రి అమరావతికి బయలుదేరారు.

## పత్తి సేకరణలో కర్నూలుకు మూడో స్థానం



పెంచికలపాడులో రైతుల నుంచి పత్తి కొనుగోళ్లను పరిశీలిస్తున్న అధికారులు

కర్నూలు అగ్రికల్చర్, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): ఈ సంవత్సరం ఖరీఫ్‌లో పత్తి పంట సాగులో ఉమ్మడి కర్నూలు జిల్లా రాష్ట్రంలోనే మూడో స్థానంలో నిలిచింది. మొదటి రెండు స్థానాల్లో గుంటూరు, కృష్ణా జిల్లాలు ఉన్నాయి. దాదాపు 2 లక్షల హెక్టార్లలో ఈ పంటను రైతులు సాగు చేశారు.. గతంలో ఎన్నడూ లేని విధంగా ఎకరాకు 8 క్వింటాళ్ల నుంచి 10 క్వింటాళ్ల దాకా పత్తి దిగుబడి రైతుల చేతికి అందింది. పంట దిగుబడి అందినట్లుగానే సీసీఐ ద్వారా రైతుల నుంచి ఎక్కువ మొత్తంలో పత్తిని సేకరించేందుకు ఉమ్మడి కర్నూలు జిల్లాలోని మార్కెట్ కమిటీల సెక్రటరీలు ఎక్కువగా కృషి చేశారు. దీంతో రాష్ట్రంలోనే రైతుల నుంచి పత్తిని సీసీఐ ద్వారా కొనుగోలు చేసిన జిల్లాలో కర్నూలుకు మూడో స్థానం దక్కింది. కోడుమూరు మార్కెట్ కమిటీ పరిధిలోని పెంచికలపాడు సీసీఐ కేంద్రం ద్వారా 2,633 మంది రైతుల నుంచి 83,712 క్వింటాళ్ల పత్తిని రైతుల నుంచి సేకరించారు. అదే విధంగా ఆదోని మార్కెట్ కమిటీ పరిధిలో 7,240 మంది రైతుల నుంచి 1,70,655 క్వింటాళ్ల పత్తిని సేకరించారు. ఎమ్మిగనూరు మార్కెట్ కమిటీ పరిధిలో 4,975 మంది రైతుల నుంచి 98,493 క్వింటాళ్ల పత్తిని సేకరించారు. మంత్రాలయం మార్కెట్ కమిటీ పరిధిలో 2,320 మంది రైతుల నుంచి 52,829 క్వింటాళ్ల పత్తిని స్వీకరించారు. ఆయా మార్కెట్ కమిటీల పరిధిలో మొత్తం 17,168 మంది రైతుల నుంచి 4,48,074 క్వింటాళ్ల పత్తిని సేకరించడం జరిగిందని, వీరికి రూ.297.91 కోట్ల మొత్తాన్ని రైతుల బ్యాంకు ఖాతాలకు సీసీఐ సంస్థ ద్వారా జమ చేసినట్లు మార్కెటింగ్ శాఖ ఏడీఎం నారాయణమూర్తి తెలిపారు. నంద్యాల జిల్లాలో సీసీఐ సంస్థ ఒక్క కేంద్రాన్ని కూడా ఏర్పాటు చేయలేదు. అయినప్పటికీ ఆ జిల్లాలోని పత్తి రైతులకు గిట్టుబాటు ధర అందించేందు కోసం కర్నూలు జిల్లాలోని కోడుమూరు మార్కెట్ కమిటీ పరిధిలో ఉన్న పెంచికలపాడు కొనుగోలు కేంద్రం ద్వారా రైతులు తెచ్చిన పత్తిని సేకరించడంలో ఆ మార్కెట్ కమిటీ సెక్రటరీ సుందర్‌రాజు, సూపర్‌వైజర్లు శ్రీనివాసులు, రషీద్ చర్యలు తీసుకోవడంతో రైతులు ప్రయోజనం పొందారు.

### నేడు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక

కర్నూలు కలెక్టరేట్, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): కలెక్టరేట్‌లోని సునయన ఆడిటోరియంలో సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమంలో ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తామని కలెక్టర్ ఒక ప్రకటనలో తెలిపారు. అన్ని మండల కేంద్రాల్లో మున్సిపల్ కార్యాలయాల్లో, డివిజన్ స్థాయిలో కూడా ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం జరుగుతుందని తెలిపారు.

# పట్టాలు తప్పిన గూడ్స్ రైలు

- బోగీలను తగిలిన బర్రెల మృత్యువాత
- గాజులపల్లి రైల్వే స్టేషన్ సమీపంలో ఘటన
- పలు స్టేషన్లలో మూడు గంటల పాటు నిలిచిన రైళ్లు
- ఇబ్బందులు పడ్డ ప్రయాణికులు



పట్టాలు తప్పిన గూడ్స్ రైలు బోగీలు

మహానంది, మార్చి 9(ఆంధ్రజ్యోతి): గుంటూరు-గుంతకల్లు రైల్వే మార్గంలో నంద్యాల జిల్లా మహానంది మండలంలోని గాజులపల్లి రైల్వే స్టేషన్ సమీపంలో గూడ్స్ రైలు పట్టాలు తప్పింది. 242/8.5 కిలో మీటర్ల మధ్య ప్రాంతంలో ఈ ఘటన జరిగింది. దీంతో ఆ మార్గంలో మూడు గంటల పాటు రైళ్ల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. వివరాలివీ.. నంద్యాల నుంచి నల్లపాడుకు ఖాళీ గూడ్స్ రైలు నంబర్ బీవోఎక్స్ఎన్-67 బయలు దేరింది. మార్గమధ్యంలోని గాజులపల్లి రైల్వే స్టేషన్ దాటగానే మధ్యాహ్నం 12.38 గంటల సమయంలో రెండు బర్రెలు ఆకస్మాత్తుగా గూడ్స్ రైలులోని 4, 5 బోగీలను ఢీకొనడంతో హోస్ పైపు తెగిపోయింది. దీంతో ఇంజన్‌కు బోగీల మధ్య సంబంధం తెగిపోయి ఆటోమెటిక్‌గా ఎమర్జెన్సీ బ్రేక్ అప్లయ్ కావడంతో గూడ్సు రైలు రెండు బోగీలు పట్టాలు తప్పాయి. ప్రమాదానికి కారణమైన రెండు బర్రెలు అక్కడికక్కడే చనిపోయాయి. గుంతకల్లు నుంచి యాక్సిడెంటల్ రిలీఫ్ ట్రైన్ గాజులపల్లికి చేరుకుంది. రైల్వే సాంకేతిక సిబ్బంది శరవేగంగా పట్టాలు తప్పిన గూడ్స్‌లోని రెండు బోగీలను క్రమబద్ధీకరించారు. దెబ్బతిన్న ట్రాక్‌కు మరమ్మతులు చేశారు. వీటిని గాజులపల్లి రైల్వే స్టేషన్‌కు తరలించారు. గూడ్స్ రైలును తిరిగి నంద్యాల రైల్వే స్టేషన్‌కు చేర్చారు. 02811 నెంబర్ గల భువనేశ్వర్-యశ్వంతపూర్ ప్రత్యేక రైలును ప్రకాశం జిల్లా గిద్దలూరు రైల్వే స్టేషన్‌లో రైల్వే అధికారులు మధ్యాహ్నం 2 గంటల సమయంలో నిలిపివేశారు. దీంతో ఆ రైలు మూడు గంటలు ఆసల్యంగా గాజులపల్లి మీదుగా వెళ్లింది. అలాగే కాచిగూడ నుండి గుంటూరుకు వచ్చే 17254 నెంబరు రైలును బేతంచెర్ల రైల్వే స్టేషన్‌లో నిలిపివేయడంతో ప్రయాణికులు మూడు గంటల పాటు ఇబ్బందులు పడ్డారు. కాగా గూడ్స్ వెళ్లేటప్పుడు స్టేషన్ సమీపంలోని ప్రధాన రహదారి గాజులపల్లి రైల్వే గేటు వేయడంతో బైక్‌పై వేచి ఉన్న మహానంది మండలం నందిపల్లికి చెందిన శ్యామ్ అనే యువకునికి రైల్వే ట్రాక్‌పై ఉన్న రాయి బలంగా తగలడంతో తీవ్రంగా గాయపడ్డాడు. అలాగే టిప్పర్‌కు కూడా రాయి తగలడంతో అద్దం పగిలిపోయింది. ప్రమాదానికి గల కారణాలను రైల్వే పోలీసులు విచారిస్తున్నారు. నంద్యాల రైల్వే సీఐ నాగభూషణం, బీవోఐ వెంకటేశ్వర్లు వెంకటేశ్వర్లు సిబ్బందితో చేరుకొని దెబ్బతిన్న ట్రాక్ మరమ్మతులు వేగవంతంగా జరిగేటట్లు చేశారు.

## దూదేకొండ వద్ద టమోటా ప్రాసెసింగ్ యూనిట్

- పనులు కేటాయించనున్న ఏపీ ఫుడ్ ప్రాసెసింగ్ సొసైటీ
- 14న భూమి పూజ చేయనున్న ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు

7

## సీసీఐ కొనుగోళ్లపై విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆకస్మిక తనిఖీ

# గ్రేడింగ్‌తో దగా

- చట్టంలో లేని విధానంతో మార్కెట్ యార్డులో దోపిడీ
- అధికారుల ఆదేశాలు బేఖాతరు
- ఆదోని మార్కెట్‌లో తీవ్రంగా నష్టపోతున్న వేరుశనగ రైతులు
- ఇతర మార్కెట్లకు తరలుతున్న వేరుశనగ

ఆదోని అగ్రికల్చర్, మార్చి 9 (ఆంధ్రజ్యోతి) : వేరుశనగ క్రయ విక్రయాలకు ఆదోని మార్కెట్ ప్రసిద్ధి. ఇక్కడి వ్యాపారులు చట్టాన్ని ఉల్లంఘించి రైతులను నిలువునా ముంచుతున్నారు. మార్కెటింగ్ శాఖ చట్టంలో లేని గ్రేడింగ్ (పాసింగ్ విధానం) తీసుకురావడంపై రైతులు మండిపడుతున్నారు. మార్కెట్‌కి వచ్చిన సరకును రైతులు యార్డు ఆవరణలో సదరు కమిషన్ ఏజెంట్ దుకాణం ముందు రాశిగా పోసి టెండరుకు ఉంచుతారు. వాటికి దుకాణ గుమస్తాలు టెండర్ లాట్ నెంబర్ చీటీలు అతికిస్తారు. వీటికి వ్యాపారులు ఈనామ్ విధానంలో ధర నమోదు చేస్తారు. ఎవరు అధిక ధర వేస్తే వారికి సరుకు ఇచ్చినట్లు ప్రకటిస్తారు. ఈ ప్రక్రియ అంతా మధ్యాహ్నం 1 గంటలోపు పూర్తి కావాలి. కానీ దీనికి విరుద్ధంగా గ్రేడింగ్ (పాసింగ్) విధానాన్ని ఇక్కడ అమలు చేస్తున్నారు. నిజానికి టెండర్ ప్రకటన అయిపోయిన వెంటనే సరుకు దక్కించుకున్న వ్యాపారులు సరకు నింపి, తూకాలు వేసుకోవాలి. అలా కాకుండా సాయంత్రం వరకు ఆరబెట్టి.. వాటిని తూర్పార పట్టి.. తూకాలు వేస్తున్నారు. రైతులు ఇంటి దగ్గరే సరకును శుభ్రం చేసుకుని (గ్రేడింగ్) యార్డు తెస్తారు. ఇంత చేసినా యార్డుకు వచ్చే సరికి మాత్రం రైతుకు నిరీక్షణ తప్పడం లేదు. పాసింగ్ విధానం మార్కెటింగ్ శాఖకు విరుద్ధమని పలుమారులు అధికారులు హెచ్చరించిన వేరుశనగ వ్యాపారులు బేఖాతార్ చేస్తున్నారు.



ఆదోని మార్కెట్ యార్డ్‌లో దుకాణాల ముందు టెండర్ కోసం రాశులుగా పోసిన వేరుశనగ

### క్వింటంపై రూ.250-500 నష్టం

గ్రేడింగ్ విధానంతో క్వింటంపై సగటున రూ.250-500 వరకు నష్టం వాటిల్లుతోంది. రైతు కనిష్ఠంగా 5 క్వింటాళ్లు, గరిష్ఠంగా 20-30 క్వింటాళ్ల వరకు అమ్మకానికి తెస్తారు. ఈ లెక్కన చిన్న రైతు రూ.2వేలు, పెద్ద రైతు రూ.10-15వేలు నష్టపోతున్నారు. వాస్తవానికి రైతు యార్డుకు సరకు తెచ్చి రాశిగా టెండర్‌కు పోసి పెడితే.. సరుకు చూసి వ్యాపారి ధర నమోదు చేయాలి. వెంటనే ధర నమోదు చేసి కొనుగోలు చేయాలి. పాసింగ్ విధానంతో రైతులను సాయత్రం వరకు యార్డులో ఉంచడంతో నష్ట పోవాల్సి వస్తోందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

### తరలుతున్న వేరుశనగ

ఎమ్మిగనూరు, కర్నూలులో అధిక మొత్తంలో వేరుశనగ అమ్మకానికి తీసుకొస్తారు. పక్కనే ఉన్న కర్ణాటకలోను శిరుగుప్ప, సింధనూర్, రాయచూరు వంటి మార్కెట్ యార్డులోనూ పాసింగ్ విధానం లేదు. ఒకప్పుడు ఆదోనిలో వేరుశనగ వ్యాపారానికి పెట్టింది పేరు. ఏడాది మొత్తంలో పది లక్షల క్వింటాళ్ల వరకు అమ్మకాలు జరిగేది. ప్రస్తుతం రెండు-మూడు లక్షల క్వింటాళ్లలోపే సరుకు వస్తోంది. ఇందుకు ప్రధానం కారణం.. పాసింగ్ విధానం ఉండటంతో రైతులంతా ఆదోని మార్కెట్‌కు వచ్చేందుకు జంకుతున్నారు. దీంతో ఇతర యార్డులకు తరలించి అమ్ముకుంటున్నారు. ఇదే వ్యాపారులు సరుకు తక్కువ పడితే.. ఇతర మార్కెట్‌లకు వెళ్లి... పాసింగ్ విధానం లేకుండానే కొనుగోలు చేస్తారు.

### గ్రేడింగ్ విధానంపై సీరియస్



రైతులు అమ్మకానికి తెచ్చిన వేరుశనగను కూలీలతో పాసింగ్ చేయొద్దని పలుమార్లు హెచ్చరించాం.. మైక్‌లోను అనౌన్స్ చేయించాం. నోటీసులు కూడా జారీ చేశాం. పాసింగ్ రద్దు చేయాలని సీరియస్‌గా ప్రయత్నిస్తున్నాం. వ్యాపారులను సమావేశపరిచి రైతులకు నష్టం కలిగించే ఈ విధానాన్ని మానుకోకపోతే చర్యలు తీసుకుంటామని హెచ్చరిస్తాం.

\- రామ్మోహన్ రెడ్డి, కార్యదర్శి, మార్కెట్ యార్డ్ ఆదోని



రాశులుగా పోసిన వేరుశనగను గ్రేడింగ్ చేస్తున్న కూలీలు

# దూదేకొండ వద్ద టమోటా ప్రాసెసింగ్ యూనిట్

- పనులు కేటాయించనున్న ఏపీ ఫుడ్ ప్రాసెసింగ్ సొసైటీ
- 14న భూమి పూజ చేయనున్న ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు

**పత్తికొండ, మార్చి 9 (ఆంధ్రజ్యోతి):** దశాబ్దాలుగా పత్తికొండ ప్రాంత రైతులు ఎదురు చూస్తున్న ఇంటిగ్రేటెడ్ టమోటా ప్రాసెసింగ్ యూనిట్‌కు ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. పరిశ్రమలు, వాణిజ్యశాఖ, ఏపీ ఫుడ్ ప్రాసెసింగ్ సొసైటీల పేరిట రెండురోజుల క్రితం ప్రభుత్వం జీవోనెం 37ను విడుదల చేసింది. పత్తికొండ మండలంలోని దూదేకొండ గ్రామ సర్వేనెం 63/3లో 2.5 ఎకరాల్లో రూ.11కోట్ల నిధులతో ఈ ప్రాజెక్టును ఏర్పాటు చేసేందుకు అనుమతులు ఇస్తున్నట్లు జీవోలో పేర్కొంది. మార్చి 14న ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు ఈ పనులకు భూమి పూజ చేయనున్నారు.



టమోటా ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటు చేయనున్న స్థలం

### దశాబ్దాల కల..

పత్తికొండ ప్రాంతంలో ప్రధాన వాణిజ్యపంటలకు దీటుగా రైతులు టమోటాను సాగుచేస్తారు. ఏటా 700 నుండి 800 ఎకరాలలో సాగయ్యే టమోటా దిగుమతులను రైతులు పత్తికొండ మార్కెట్‌కు తరలించి అమ్ముకుంటారు. రాష్ట్రంలో రెండో పెద్ద టమోటా మార్కెట్‌గా పేరు ఉన్న పత్తికొండ మార్కెట్ నుండి వ్యాపారులు తెలంగాణ తమిళనాడు, కర్ణాటక ప్రాంతాలకు ఎగుమతి చేస్తుంటారు. ఎగుమతి ప్రాంతాలలో టమోటా డిమాండ్‌ను బట్టి ఇక్కడి మార్కెట్లో రైతుల నుండి పంటను కొనుగోలు చేస్తుంటారు. దీనికి తోడు వ్యాపారులు సిండికేట్‌గా మారి రైతుల వద్ద నుండి పంటను తక్కువ ధరకు కొనుగోలు చేస్తుంటారన్న ఆరోపణలు ఉన్నాయి. దీంతో టమోటాకు గిట్టుబాటు ధర దొరక్క రైతులు రోడ్డెక్కి ఆందోళనకు దిగడం, కడుపుమండి పంటను మార్కెట్‌లోనే పారబోసి వెళ్లడం సర్వ సాధారణం. దీంతో టమోటా జ్యూస్ ఫ్యాక్టరీ ఏర్పాటైతే గిట్టుబాటు ధర లభిస్తుందని దశాబ్దాలుగా రైతులు ఎదురుచూస్తున్నారు.

### నాడు జగన్ బటన్ నొక్కారు.. వదిలేశారు

టమోటా ప్రాసెసింగ్ యూనిట్‌ను ఎన్నికల అస్త్రంగా వాడుకునేందుకు గత ప్రభుత్వం ప్రయత్నించింది. అందుకోసం పత్తికొండ సమీపంలో హోసూరు రహదారిలో టమోటా ప్రాసెసింగ్ యూనిట్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించింది. అందు కోసం 2023లో జీవోనెం 739ని విడుదల చేసింది. పత్తికొండ ప్రాంత రైతులు దశాబ్దాల కలనెరవేరుస్తున్నట్లు అప్పటి ఎమ్మెల్యే గొప్పలు చెప్పారు. ఈ ప్రాజెక్టుకు అప్పట్లో ముఖ్యమంత్రి హోదాలో జగన్మోహన్‌రెడ్డి అమరావతి నుండే బటన్ నొక్కి భూమిపూజ చేశారు. ఎన్నికల అస్త్రంగా వాడుకునేందుకు ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటు కోసం ప్రయత్నించిన వైసీపీ ప్రభుత్వం 2024 ఎన్నికలనాటి వరకు టమోటా ప్రాసెసింగ్‌యూనిట్‌కు సంబంధించి ఎలాంటి పనులను చేపట్టలేకపోయింది.

### ప్రాసెసింగ్ యూనిట్‌కు అనువైన స్థలం ఎంపిక..

ఈ ప్రాంత అభివృద్ధి కార్యక్రమాలలో భాగంగా రైతుల దశాబ్దాల కల టమాటాప్రాసెసింగ్ యూనిట్ అంశాన్ని ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. దీంతో పరిశ్రమలు, వాణిజ్యశాఖ, ఏపీ ఫుడ్ ప్రాసెసింగ్ సొసైటీల పేరిట రెండురోజుల క్రితం ప్రభుత్వం టమోటా ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటుకు జీవోనెం 37ను విడుదల చేసింది. రూ 11కోట్ల నిదులతో రాష్ట్రీయ కృషి వికాస్ యోజన(ఆర్‌కేవివై), ఆపరేషన్ గ్రీన్స్ పథకం కింద ఏపీ ఫుడ్ ప్రాసెసింగ్ సొసైటీ ఈ పనులను పర్యవేక్షించేలా జీవోలో పేర్కొంది. గత ప్రభుత్వ హయాంలో జారీచేసిన 739జీవో పేర్కొన్న హూసూరు రోడ్డులోని సర్వేనెంబరు286:/1ఏ4 లో 2.5 ఎకరాల భూమి ప్రాజెక్టు ఏర్పాటుకు అనుకూలంగా లేకపోవడంతో దూదేకొండ సర్వేనంబర్ 63/3లోని 2.5 ఎకరాల స్థలంలో ఈ ఇంటిగ్రేటెడ్ టమోటా ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటు చేసేందుకు అనుమతులు మంజూరు చేసింది.




రెవెన్యూశాఖ ఏర్పాటు చేసిన బోర్డు



### 9నెలల్లో ప్రాజెక్టు పూర్తిచేస్తాం

పత్తికొండ మండలంలోని దూదేకొండ వద్ద ఇంటిగ్రేటెడ్ టమోటా ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటుకు ప్రభుత్వం అనుమతులు మంజూరు చేసింది. రూ 11కోట్లతో ఏర్పాటు కానున్న ఈ యూనిట్‌ను 9నెలల కాలవ్యవధిలో పూర్తిచేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేశాం.

\- ఉమాదేవి, పీడీ, ఏపీఎంఐపీ , కర్నూలు

## వెల్లువెత్తిన ఫిర్యాదులు

**ప్రక్షాళనకు శ్రీకారం చుట్టిన మార్కెటింగ్ శాఖ డైరెక్టర్ విజయ సునీత**

**కర్నూలు అగ్రికల్చర్, మార్చి 9 (ఆంధ్రజ్యోతి):** కూరగాయల రైతులకు గిట్టుబాటు ధర అందించడానికి గత తెలుగుదేశం ప్రభుత్వం రైతు బజార్లను ఏర్పాటు చేసింది. ఈ రైతుబజార్ల నిర్వహణలో ఎటువంటి అక్రమాలు చోటు చేసుకోకుండా అవసరమైన చర్యలు కూడా చేపట్టింది. అయితే.. గత వైసీపీ ప్రభుత్వంలో రైతుబజార్లను నిర్వీర్యం చేయడంతో ఇటు రైతులు, అటు కూరగాయల కొనుగోలుదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. మళ్లీ కూటమి ప్రభుత్వం రావడంతో రైతుబజార్ల వల్ల రైతులు, ప్రజలకు ప్రయోజనాలు అందించే విధంగా చర్యలు చేపట్టాలని మార్కెటింగ్ శాఖ డైరెక్టర్ విజయ సునీతకు ప్రభుత్వం ఆదేశించింది. దీంతో ఫిర్యాదులు వెలువెత్తుతున్న రైతుబజార్లలో ఎస్టేట్ అధికారుల బదిలీకి డైరెక్టర్ చర్యలు చేపట్టారు. కర్నూలు, నంద్యాల జిల్లాలోని ఐదు రైతుబజార్లలో పని చేస్తున్న ఎస్టేట్ అధికారులను ఇతర ప్రాంతాలకు బదిలీ చేస్తూ వారం క్రితం మార్కెటింగ్ శాఖ డైరెక్టర్ విజయ సునీత ఉత్తర్వులు జారీ చేశారు. సీ.క్యాంపు రైతుబజారు ఎస్టేట్ అధికారి హరీష్‌ను ఆదోనికి బదిలీ చేశారు. ఆదోనిలో పని చేస్తున్న అక్తర్‌ను కర్నూలు నగరంలోని కొత్తపేట రైతుబజారుకు బదిలీ చేశారు. వెంకటరమణ కాలనీలోని ఎస్టేట్ అధికారి కళ్యాణమ్మను సీ. క్యాంపు రైతుబజారుకు బదిలీ చేశారు. కొత్తపేట రైతుబజారు ఎస్టేట్ అధికారి జయలక్ష్మిని వెంకటరమణ కాలనీ రైతు బజారుకు బదిలీ చేశారు. రైతుబజార్లలో ఎస్టేట్ అధికారులతో పాటు సిబ్బంది కార్యకలాపాలపై మార్కెటింగ్ శాఖ ఏడీఎంలు తప్పనిసరిగా దృష్టి సారించి రైతులకు, ప్రజలకు ప్రయోజనాలు అందించాలని ఎక్కువగా రైతులే రైతుబజార్ల వల్ల పర్యవేక్షణ చేయాలని, అక్రమాలపై దృష్టి పెట్టాలని ఆయా జిల్లాల మార్కెటింగ్ శాఖ అధికారులకు డైరెక్టర్ విజయ సునీత ఉత్తర్వులు జారీ చేశారు.

## 12న వైసీపీ పోరుబాట

**జిల్లా అధ్యక్షుడు ఎస్వీ మోహన్‌రెడ్డి**



పోరుబాట పోస్టరును విడుదల చేస్తున్న వైసీపీ నాయకులు

**కర్నూలు న్యూసిటీ, మార్చి 9(ఆంధ్రజ్యోతి):** రాష్ట్రవ్యాప్తంగా విద్యార్థులు, నిరుద్యోగుల కోసం వైసీపీ అధ్వర్యంలో ఈ నెల 12న పోరుబాట కార్యక్రమానికి పిలుపునిచ్చినట్లు వైసీపీ కర్నూలు జిల్లా అధ్యక్షుడు ఎస్వీ మోహన్‌రెడ్డి అన్నారు. ఆదివారం ఎస్వీ కాంప్లెక్స్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పేద విద్యార్థుల చదువులకు ఇబ్బంది లేకుండ దివంగత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ఫీజు రీయంబర్స్‌మెంట్ ప్రవేశపెట్టారన్నారు. చంద్రబాబు హయాంలో ఫీజు రీయంబర్స్‌మెంట్ నిర్వీర్యమైందన్నారు. కూటమి ప్రభుత్వ బడ్జెట్‌లో విద్యాదీవెన, ఫీజు రీయంబర్స్‌మెంట్‌కు ఊసేలేదన్నారు. ఈ సమావేశంలో కోడుమూరు ఇన్‌చార్జి ఆదిమూలపు సతీష్, కేడీసీసీ మాజీ చైర్మన్ ఎస్వీ విజయమనోహరి, సీనియర్ నాయకుడు గడ్డం రామక్రిష్ణ తదితరులు పాల్గొన్నారు.

## వ్యాధులతో అప్రమత్తంగా ఉండాలి: డీఎంహెచ్‌వో

**వెల్దుర్తి, మార్చి 9(ఆంధ్రజ్యోతి):** వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని డీఎంహెచ్‌వో శాంతికళ ప్రజలకు సూచించారు. మండలంలో రామళ్లకోట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని రత్నపల్లె గ్రామంలో నిర్వహిస్తున్న వైద్య శిబిరాన్ని, వెల్దుర్తి సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని ఆదివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆమె మాట్లాడుతూ వ్యక్తిగత శుభ్రత, పరిసరాల పరిశుభ్రత గురించి ప్రజలకు అవగాహన కల్పించారు. కాచి చల్లార్చిన నీటిని తాగాలని సూచించారు. జ్వరాలు, వాంతులు, విరేచనాలు ప్రబలకుండా ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. గ్రామంలో ఇంటింటికి తిరిగి ఫీవర్ సర్వే నిర్వహించాలన్నారు. జిల్లా పంచాయతీ అధికారి భాస్కర్ మాట్లాడుతూ గ్రామంలో అపరిశుభ్రంగా ఉన్న పరిసరాలను, డ్రైనేజీ కాలువలను శుభ్రం చేయాలన్నారు. డ్రైనేజీల వద్ద తాగునీటి పైపుల లీకేజీ తనిఖీ చేసి నీరు కలుషితం కాకుండా చర్యలు తీసుకోవాలని సిబ్బందిని ఆదేశించారు. కార్యక్రమంలో డీఐవో నాగప్రసాద్, నోడల్ అధికారి రఘు, ఎపిడామాలజిస్టు వేణుగోపాల్, ఎంపీహెచ్‌ఈవో చలపతిరావు, డాక్టర్ భువనతేజ, హెల్త్ సూపర్‌వైజర్ మోహన్, ఆనమ్మ తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో టీడీపీ అభిమాని మృతి

**గోనెగండ్ల, మార్చి 9(ఆంధ్రజ్యోతి):** గ్రామ శివార్లలో శనివారం రాత్రి గుర్తు తెలియని వాహన డీ కొని ఒంటెడుదిన్నె గ్రామానికి చెందిన కురువ ఈరన్న(30) అనే టీడీపీ అభిమాని మృతి చెందాడు. ఈ ఘటన ఆదివారం జరిగింది. కురువ ఈరన్న నాలుగేళ్లుగా పార్టీ టీషర్టు వేసుకొని యువగళం జెండాను చేతపట్టుకొని గోనెగండ్ల, ఒంటెడుదిన్నె, గాజులదిన్నె, హెచ్‌కైరవాడి గ్రామాలలో తిరిగేవాడు. ఈరన్న తల్లిదండ్రులు చిన్నతనంలోనే మృతి చెందారు. ఆలనా పాలన చూసుకొని వారు లేక పోవడంతో టీడీపీ జెండా చేపట్టి గ్రామాలు తిరుగుతూ ఎవరు అన్నం పెడితే వారి దగ్గర తింటూ తిరిగేవాడు. శనివారం రాత్రి గోనెగండ్ల నుంచి స్వగ్రామమైన ఒంటెడుదిన్నెకు కాలి నడకన వెళుతుండగా గుర్తు తెలియని వాహనం డీ కొట్టడంతో తీవ్రగాయాల పాలయ్యాడు. స్థానికులు 108లో కర్నూలు ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం తెల్లవారుజామున మృతి చెందాడు. మృతుని అక్క నరసమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ గంగాధర్ తెలిపారు.

## సీసీఐ కొనుగోళ్లపై విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆకస్మిక తనిఖీ

- పరిశ్రమల్లో దూది బేళ్లు, రికార్డుల పరిశీలన
- ఎమ్మెల్యే ఫిర్యాదుతో కదిలిన విజిలెన్స్ అధికారులు

**ఆదోని అగ్రికల్చర్, మార్చి 9 (ఆంధ్రజ్యోతి) :** కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ) రైతుల నుంచి కనీస మద్దతు ధరతో పత్తి కొనుగోళ్లలో అవకతవకలు జరిగాయన్న ఆరోపణలపై రీజినల్ విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎస్పీ చౌడేశ్వరి, ఏవో విశ్వనాథ్, మార్కెట్ యార్డ్ కార్యదర్శి రామ్మోహన్ రెడ్డితో కలిసి శనివారం రాత్రి ఆదోనిలో తనిఖీలు చేశారు. మధ్యాహ్నం నుంచే క్షేత్రస్థాయిలో గ్రామాల్లోని రైతులు దగ్గరకు వెళ్లి విచారణ చేసుకున్నట్లు సమాచారం. సాయంత్రం సీసీఐ లీజుకు తీసుకున్న పత్తిపరిశ్రమలు ఎన్‌డీబీ ఎల్ జిన్నింగ్ అండ్ ప్రెస్సింగ్ పరిశ్రమతోపాటు దారా శ్రీ జిన్నింగ్ అండ్ ప్రెస్సింగ్ పరిశ్రమల్లో ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఎంతమంది రైతుల నుంచి పత్తిని కొనుగోళ్లు చేశారని, రైతుల ఖాతాలో జమ చేసిన చెల్లింపులుపై క్షుణ్ణంగా రికార్డులను పరిశీలించారు. సీసీఐ కొనుగోలు కేంద్రం ఇన్‌చార్జీ భరత్‌తో విచారించుకున్నారు. ఎమ్మెల్యే డాక్టర్ పార్థసారథి గత రెండు నెలల క్రితం సీసీఐ కొనుగోళ్లలో భారీ అక్రమాలు జరిగాయని దీనిపై విచారణ చేపట్టాలని ప్రభుత్వానికి జిల్లా కలెక్టర్‌తో పాటు విజిలెన్స్ ఎన్ఫోర్స్‌మెంట్ అధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎస్పీ చౌడేశ్వరి నేతృత్వంలో విచారణ చేపట్టారు. పత్తి పరిశ్రమల్లో నిల్వ ఉన్న దూది బేళ్లను, పరిశ్రమ నిబంధనలను విచారణకు సంబంధించి వివరాలను ప్రభుత్వానికి నివేదిక పంపనున్నారు.



ఎన్డీబీఎల్ పరిశ్రమలో సీసీఐ కొనుగోలు చేసిన దూది బేళ్లను పరిశీలిస్తున్న విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎస్పీ చౌడేశ్వరి

## దొంగ అరెస్టు.. బంగారు స్వాధీనం

**నందికొట్కూరు, మార్చి 9 (ఆంధ్రజ్యోతి):** దొంగతనం కేసులో 24 గంటల్లో నిందితుడిని అరెస్టు చేసినట్లు పట్టణ సీఐ ప్రవీణ్ కుమార్‌రెడ్డి తెలిపారు. ఆదివారం సీఐ మాట్లాడుతూ శనివారం ఉదయం 12 గంటల ప్రాంతంలో పట్టణంలోని కురువ వీధికి చెందిన శ్రీనివాసులు ఇంట్లోకి దొంగలు చొరబడి బీరువాను పగల గొట్టి ఒక బంగారు గొలుసు, ఒక జత చెవి చుట్లు, ఒక జత చెంప చారలు, ఒక లాంగ్ చైన్ బంగారు వస్తువులను దొంగలించారని చెప్పారు. వీటి విలువ సుమారు రూ.2.40 లక్షలు ఉంటుందని ఆయన తెలిపారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు ఆదివారం 12 గంటల ప్రాంతంలో దొంగలించిన సొమ్మును అమ్ముకోవడానికి నందికొట్కూరు పట్టణ శివారులోని మార్కెట్ యార్డు సమీపంలో ఉండగా ఎస్ఐ సురేష్ బాబు, పోలీసు సిబ్బంది దొంగను చుట్టుముట్టి అదుపులోకి తీసుకున్నారు. దొంగ ఓర్వకల్లు మండలం ఉశేనాపురం గ్రామానికి చెందిన చుక్కబొట్ల ప్రవీణ్(20)గా గుర్తించారు. గతంలో గొర్రెలు, మేకపోతులు దొంగలించిన కేసులో కూడా ఇతడు నిందితుడిగా ఉన్నట్లు చెప్పారు. పోలీసులు అదుపులోకి తీసుకొని రిమాండ్‌కు పంపినట్లు సీఐ తెలిపారు.

## వివిధ బ్యాంకుల ద్వారా శ్రీమఠానికి రూ.1.07 కోట్ల విరాళం

**మంత్రాలయం, మార్చి 9 (ఆంధ్రజ్యోతి):** మంత్రాలయం రాఘవేంద్రస్వామి మఠానికి ఎల్ఐసీ 33 లక్షలు, కర్ణాటక బ్యాంకు రూ.22 లక్షలు, స్టేట్ బ్యాంకు ఆఫ్ ఇండియా రూ.42లక్షలు, కెనరా బ్యాంకు రూ.10లక్షలు విరాళం ఇచ్చినట్లు మఠం మేనేజర్ వెంకటేశ్ జోషి తెలిపారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ మఠం పీఠాధిపతి సుబుధేంద్రతీర్థుల ఆదేశాల మేరకు మంత్రాలయం రాఘవేంద్రస్వామి మఠం అభివృద్ధి కోసం మంత్రాలయంలో ఉన్న వివిధ బ్యాంకులు తమ వంతుగా విరాళాలు ఇచ్చి సహకరిస్తున్నాయని తెలిపారు. ఎల్ఐసీ ఇచ్చిన రూ.33 లక్షలతో భక్తుల తాగునీటి కోసం రెండు ఆర్వో ప్లాంట్లు నిర్మించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. కర్ణాటక బ్యాంకు ఇచ్చే రూ.22 లక్షలకు మరో రూ.3 లక్షలు శ్రీమఠం నుంచి కలిపి రూ.25 లక్షలతో టీటీ వాహనం కొంటున్నట్లు తెలిపారు. ఎస్‌బీఐ ఇచ్చిన రూ.42 లక్షలతో ఆర్వో ప్లాంటు, యూపీవీసీ కియోస్క్ నిర్మాణం చేపడుతున్నట్లు తెలిపారు. కెనరా బ్యాంకు ఇచ్చిన రూ.10 లక్షలతో బొలేరో వాహనానికి ఆర్డర్ ఇచ్చినట్లు తెలిపారు. వివిధ బ్యాంకుల మేనేజర్లతో పాటు బ్యాంకు ఎండీలు, డైరెక్టర్లకు మఠం పీఠాధిపతి సుబుధేంద్రతీర్థులు రాఘవేంద్రస్వామి మెమెంటో, శేషవస్త్రం, ఫలపుష్ప మంత్రాక్షితలు ఇచ్చి ఆశీర్వదించినట్లు తెలిపారు.



మాట్లాడుతున్న వెంకటేశ్ జోషి

## కర్నూలు బాలోత్సవం కమిటీ ఎన్నిక

**అధ్యక్షుడిగా పుల్లయ్య, ప్రధాన కార్యదర్శిగా ధనుంజయ**

**కర్నూలు ఎడ్యుకేషన్, మార్చి 9 (ఆంధ్రజ్యోతి):** కర్నూలు బాలోత్సవం కమిటీ ఎన్నికైంది. ఆదివారం కర్నూలు కేకే భవన్‌లో బాలోత్సవ కమిటీ సమావేశం నిర్వహించి కమిటీని ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షుడిగా మాంటి స్సోరి పాఠశాలల అధినేత రాజశేఖర్, అధ్యక్షుడిగా రవీంద్ర విద్యాసంస్థల అధినేత జి.పుల్లయ్య, గౌరవ సలహాదారులు క్లస్టర్ వర్సిటీ డీన్ డా. అక్తర్ భాను, కార్యనిర్వాహక అధ్యక్షుడిగా జంధ్యాల రఘుబాబు, ప్రధాన కార్యదర్శిగా డి., దనుంజయ ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో జేవీవీ సీనియర్ నాయకులు డా.బడే సాహెబ్, ప్రజాశక్తి జనరల్ మేనేజర్ టి. నరసింహ, ఆర్థిక నిపుణుడు మన్సూర్ రెహమాన్, సీఐటీయూ జిల్లా నాయకుడు బి. రామాంజనేయులు పాల్గొన్నారు.

## తమ్మరాజుపల్లె ఘాట్‌లో దారి దోపిడీ

**సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌పై దాడి.. బంగారు ఆభరణాలు ఎత్తుకెళ్లిన దుండగులు**

**బేతంచెర్ల, మార్చి 9 (ఆంధ్రజ్యోతి):** పాణ్యం-బేతంచెర్ల, తమ్మరాజుపల్లె ఘాట్ రోడ్డులో బేతంచెర్ల వైపు బైకుపై వస్తున్న సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ జశ్వంత్ అనే యువకుడిపై ట్రాలీ వాహనంపై వచ్చిన దుండగులు దాడి చేసి నాలుగు తులాల బంగారు, రెండు బంగారు ఉంగరాలను అపహరించుకుని వెళ్లారు. విషయం తెలిసిన వెంటనే 108 సిబ్బంది బేతంచెర్ల ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకువచ్చి గాయపడిన జశ్వంత్‌ను ప్రథమ చికిత్స నిర్వహించి మెరుగైన వైద్యం కోసం 108లో కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది. బేతంచెర్ల పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

## వైద్యుల నిర్లక్ష్యంతోనే పసికందు మృతి

**అందోళనకు దిగిన బాలింత బంధువులు**



అందోళన చేస్తున్న పసికందు బంధువులు

**ఎమ్మిగనూరు టౌన్, మార్చి 9 (ఆంధ్రజ్యోతి):** వైద్యుల నిర్లక్ష్యంతో అప్పుడే పుట్టిన పసికందు మృతి చెందినట్లు బాధిత కుటుంబ సభ్యులు ఆరోపించారు. బాధితుల కథనం మేరకు.. గోనెగండ్లకు చెందిన నరసింహులు భార్య సువార్తమ్మ ప్రసవం కోసం ఎమ్మిగనూరు ప్రభుత్వ ఆసుపత్రికి ఉదయం 10గంటలకు వచ్చింది. ప్రసవ సమయంలో డ్యూటీ డాక్టర్లు లేకపోవడంతో ఆ సమయంలో స్టాఫ్ నర్సులు డెలివరీ చేశారు. పసికందుకు సీరియస్‌గా ఉందని ప్రైవేట్ వైద్యశాలకు వెళ్లాలని చెప్పడంతో, పట్టణంలోని ఓ ప్రైవేట్ వైద్యశాలకు తీసుకెళ్తుతుండగా మార్గమధ్యంలో పసికందు మృతి చెందింది. దీంతో బంధువులు తిరిగి వచ్చి ప్రభుత్వ ఆసుత్రికి ముందు పెట్టి పసికందు శవాన్ని పెట్టి అందోళనరు దిగారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వైద్యుల నిర్లక్ష్యం వల్లే పసికందు మృతి చెందిందని ఆరోపించారు.

### అందుబాటులో లేని డ్యూటీ డాక్టర్లు

ఆదివారం ప్రసవం కోసం వచ్చే వాళ్ళ కోసం గైనకాలజిస్టు, చిన్న పిల్లల వైద్యనిపుణులు అందుబాటులో ఉండాలి. అయితే వైద్యాధికారులు ఫోన్‌లోనే స్టాఫ్ నర్సులకు వైద్య సూచనలు చేయగా వారు సువార్తమ్మకు కాన్పు చేసినట్లు తెలుస్తోంది. చిన్న పిల్లల వైద్యనిపుణులు కూడా అట్లాగే ఫోన్‌లో వైద్య సూచనలు చేశారు. దీని వల్లే పసికందు మృతి చెందినట్లు బంధువులు ఆరోపిస్తున్నారు.

**వివరణ:** డ్యూటీ డాక్టర్ సుమిత్రను దీనిపై వివరణ కోరగా.. ఉదయం 10గంటలకు డెలివరీ కోసం అడ్మిట్ చేసుకున్నామని అన్నారు. స్కాన్ చేసి చూడగా బేబి లోపల మలవిసర్జన చేసి ఉండడం వలన క్రిటికల్‌గా ఉందని వారికి ముందే చెప్పామన్నారు. డెలివరీ సమయాన రెండు పేగులు మెడకు చుట్టుకొని బైటికి రావడం వలన మెరుగైన వైద్యం కోసం ప్రైవేట్ ఆసుపత్రికి రెఫర్ చేశామన్నారు. అయితే వారు ఆలస్యం చేయడం వల్ల బేబి మృతి చెందిందని తెలిపారు.

## రోడ్డు ప్రమాదంలో రైతు మృతి

**ఓర్వకల్లు, మార్చి 9 (ఆంధ్రజ్యోతి):** కర్నూలు-చిత్తూరు జాతీయ రహదారిపై నన్నూరు గ్రామ సమీపాన యూటర్న్ వద్ద ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ రైతు మృతి చెందాడు. నంద్యాల జిల్లా గడివేముల మండలం వండుట్ల గ్రామానికి చెందిన తలారి రంగనాయకుడు రోడ్డు దాటుతుండగా.. లారీ ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతి చెందిన రైతు ఓర్వకల్లులో పొగాకు విక్రయించి నన్నూరు వద్ద భోజనం చేసేందుకు రోడ్డు దాటుతుండగా.. ఈ ప్రమాదం సంభవించింది. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

## కర్నూలు జైలుకు పోసాని



**కర్నూలు, మార్చి 9 (ఆంధ్రజ్యోతి):** కర్నూలు జిల్లా ఆదోని త్రీటౌన్ పోలీసులు నమోదు చేసిన కేసులో సినీ నటుడు, వైసీపీ నాయకుడు పోసాని కృష్ణమురళి కర్నూలు జిల్లా జైలులో రిమాండ్‌లో ఉన్నారు. అయితే విజయవాడలోని భవానీపురం పోలీస్ స్టేషన్‌లో నమోదైన కేసులో పోసానిని అక్కడి పోలీసులు కర్నూలు జైలు నుంచి పీటీ వారెంట్‌పై శనివారం ఉదయం 8 గంటలకు తీసుకెళ్లి విజయవాడ కోర్టులో హాజరు పరిచారు. అనంతరం విజయవాడ నుంచి కర్నూలుకు తరలించారు. ఆదివారం తెల్లవారుజామున 2.30 గంటల సమయంలో జిల్లా జైలుకు చేరుకున్నట్లు తెలిసింది. వైసీపీ అధికారంలో ఉండగా.. టీడీపీ అధినేత, ప్రస్తుత ముఖ్యమంత్రి చంద్రబాబు, జనసేన అధినేత, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్, విద్యా, ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్ సహా వారి కుటుంబ సభ్యులపై పోసాని కృష్ణమురళి జుగుప్సాకర విమర్శలు చేసిన విషయం విషయం విదితమే.

ఆంధ్రజ్యోతి
చిన్న ప్రకటన - పెద్ద స్పందన CLASSIFIEDS

**BUSINESS OPPORTUNITY**
Zero Investment High Reterns Walk in Interview (11-03-2025) for More Information Contact : 81254 73657, 92461 55128.
AJL-229075

**అన్ని కులాల సంబంధాలు**
బిజినెస్, సాఫ్ట్‌వేర్, ప్రభుత్వ టీచర్స్, బ్యాంక్, పోస్టల్, రైల్వే, పోలీస్, సచివాలయం, డాక్టర్ సంబంధాలు కలవు. స్టార్ మ్యారేజ్ బ్యూరో, నంద్యాల జిల్లా. సెల్ : 87908 44959. (2వ సంబంధాలు కలవు.)
AJL-229073

**కావలెను**
బాలమద్దిలేటి & సన్స్ ఎ/సి హేర్ & బ్యూటీ సెలూన్ షాప్ నందు పనిచేయుటకు వర్కర్స్ కావలెను. కోవెలకుంట్ల. సంప్ర సెల్:98854 46126, 88974 76747.
AJL-229077

**CHANGE OF NAME**
I, SHAIK.NAHEDA (Old Name) W/o. Shaik. Hussain Sa, H.No: 28-848 MB7, NGOS Colony, Nandyal (Md), Nandyal (Dt)-518501, A.P., hereby declare that henceforth I have change my name from Shaik Naheda To SHAIK NAHIDA (New Name) W/o.Shaik. Hussain Sa
AJL-229651

**బంగారం కొనబడును**
మీ బంగారం, వెండి, డైమండ్స్ బ్యాంక్స్, ఫైనాన్స్‌లో తాకట్టులో వున్నవి మా డబ్బుతో విడిపించి కొనబడును. స్పాట్ క్యాష్, పేమెంగ్ చేయబడును.(రిజిస్టర్డు పోలీస్ డిపార్టుమెంట్) గోల్డెన్ ట్రేడింగ్ కంపెనీ. సంప్రః 7382114647
AJA-226961

**FOR ADVERTISEMENTS CONTACT.**
Cell: 99854 11369

**పాఠకులకు ముఖ్య గమనిక**
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ ఇతరత్రా నమ్మించబడిన/ క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటన దారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు. మేనేజర్ - పిడివిటి

దహనక్రియలు, ఉత్తర క్రియలు, శ్రద్ధాంజలి, అశ్రునివాళి, సంతాప, అంత్యక్రియల ప్రకటనలకు
ఆంధ్రజ్యోతి లో ప్రకటనలు ఇవ్వండి
అతి తక్కువ ఖర్చుతో అధిక ప్రచారం పొందండి.
ఆంధ్రజ్యోతి
ప్రకటనల కోసం సంప్రదించండి.
మీ స్నేహితులు, శ్రేయోభిలాషులు, కుటుంబ సభ్యులకు తక్కువ ఖర్చుతో ఆంధ్రజ్యోతిలో ప్రకటన ద్వారా శ్రద్ధాంజలి తెలియజేయండి.
99854 02121

## యాగంటీశ్వరుడికి ప్రత్యేక పూజలు


యాగంటీశ్వర స్వామికి పూజలు చేస్తున్న భక్తులు

**ఓర్వకల్లు, మార్చి 9 (ఆంధ్రజ్యోతి):** మండలంలోని ఎన్.కొంతలపాడు గ్రామంలో వెలసిన అంబాసహిత యాగంటీశ్వరస్వామి ఉత్సవాల సందర్భంగా ఆదివారం యాగంటీశ్వరునికి అమ్మవారికి పంచామృతాభిషేకం, దూపదీప నైవేద్యార్పణం పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అర్చకులు యాగంటయ్య ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఈవో చంద్రశేఖర్ రెడ్డి, ఫెస్టివల్ కమిటీ సభ్యులు శ్రీనివాసులు, చంద్రశేనా రెడ్డి పుల్లయ్య, టీడీపీ నాయకులు గోవిందరెడ్డి, మోహన్ రెడ్డి, విశ్వేశ్వరరెడ్డి, పునులూరు ప్రభాకర్‌రెడ్డి, రాంభూపాల్‌రెడ్డి, లక్ష్మీకాంతరెడ్డిపెరుగు పురుషోత్తం రెడ్డి, బ్రాహ్మణ పల్లె నాగిరెడ్డి, చదువుల సుధాకర్ రెడ్డి, చంద్ర పెద్దస్వామి, చంద్రమౌళి, అమర్నాథ్ పాల్గొన్నారు.

## నిమ్మతోటకు నిప్పుపెట్టిన దుండగులు

**కోడుమూరు రూరల్, మార్చి 9 (ఆంధ్రజ్యోతి):** మండలంలోని లద్దగిరిలో కందిపైరుకు, నిమ్మతోటకు గుర్తు తెలియని దుండగులు నిప్పుపెట్టారు. గ్రామానికి చెందిన గాడి దేవరాజు అనే రైతు సుమారు ఎకరన్నర పొలంలో కందిసాగు చేశాడు. పక్కనే మరో మూడు ఎకరాల్లో ఏడాదిన్నర క్రితం సుమారు 400 నిమ్మమొక్కలు నాటాడు. పంటకు నీటి తడులు అం దించడానికి డ్రిప్పు పైపులు ఏర్పాటు చేసుకున్నాడు. శనివారం సాయంత్రం పొలంలో ఎవరూ లేని సమయంలో గుర్తు తెలియని దుండగులు పంటకు నిప్పుపెట్టారు. ఆ సమయంలో ఇంట్లో ఉన్న రైతుకు ఈ విషయం తెలిసి అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించాడు. కోడుమూరు అగ్నిమాపక సిబ్బంది చేరుకుని మంటలను ఆర్పివేశారు. ప్రమాదంలో కందిపంటతో పాటు నిమ్మమొక్కలు, డ్రిప్పు పైపులు కాలిపోయాయి. సుమారు రూ 4 లక్షలు నష్టం వాటిల్లినట్లు బాధితుడు కన్నీటి పర్యంతమయ్యాడు.

## పారిశుధ్య పనుల పరిశీలన

**కర్నూలు న్యూసిటీ, మార్చి 9(ఆంధ్రజ్యోతి):** నగరంలోని ధర్మపేట, డీఎస్‌ఏ స్టేడియం, రాజవిహార్ ప్రాంతాలలో పారిశుధ్య పనులను ఆదివారం నగర పాలక కమిషనర్ ఎస్.రవీంద్రబాబు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల నుంచి ఫిర్యాదులు వచ్చే వరకు ఉండరాదని, దృష్టికి వచ్చిన వెంటనే సమస్యలను పరిష్కరించాలన్నారు. పారిశుధ్య పనులు సక్రమంగా చేయాలని, వీటికి సంబంధించి ఫిర్యాదులకు ఆస్కారం ఇవ్వవద్దని అధికారులను ఆదేశించారు. ఆదివారంఆయన వెంట ప్రజారోగ్య అధికారి డా.కే.విశ్వేశ్వరరెడ్డి, శానిటరీ ఇన్స్‌పెక్టర్లు ఉన్నారు.

# ఎమ్మార్పీ పై



- వైసీపీ, టీడీపీ నాయకుల సిండికేట్ మద్యం వ్యాపారం
- బ్యాటిల్‌పై అదనంగా రూ.10 నుంచి రూ.20 వసూలు
- కూటమి ప్రభుత్వంపై మందుబాబుల గరంగరం
- పట్టించుకోని ఎక్సైజ్ పోలీసులు

**కోడుమూరు, మార్చి 9(ఆంధ్రజ్యోతి):** వైసీపీ, టీడీపీ నాయకులు రాజకీయాల వరకు వస్తే ఢీ అంటే ఢీ అంటారు... అదే వ్యాపారంలో లాభాలు వస్తాయని అంటే భాయ్, భాయ్ అని చేతులు కలుపుతారు. వైసీపీ నాయకులతో టీడీపీ నాయకులు కలిసి మద్యం వ్యాపారంలో సిండికేట్‌గా ఏర్పడ్డారు. కోడుమూరు పట్టణంలో 5 మద్యం షాపుల యజమానులు ఏకమయ్యారు. దీంతో ప్రభుత్వం ఆదేశాలను లెక్క చేయకుండా ఇష్టారాజ్యంగా మద్యం సీసాపై అదనపు ధర వడ్డించి మద్యం ప్రియుల నడ్డి విరుస్తున్నారు. క్వాటర్, ఫుల్ బాటిల్, బీర్ల రేట్లను అధిక ధరలకు విక్రయిస్తున్నారు. ఎమ్మార్పీ పాటించడం లేదు. ప్రభుత్వం ఇటీవల క్వాటర్‌పై రూ.10 పెంచింది. ఇదే అదనుగా లైసెన్స్‌దారులు ప్రతి మద్యం సీసాపై ఎంఆర్‌పీ ధరకంటే అదనంగా రూ.10 నుంచి రూ.20 వరకు యథేచ్ఛగా వసూళ్లు చేస్తున్నారు. దీంతో మందుబాబులు కూటమి ప్రభుత్వంపై గరంగరంగా ఉన్నారు.

పట్టణంలో ఒక షాపు యజమాని ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం పెరిగిన ఎమ్మార్పీ ధరల కారణంగా బాటిల్‌కు రూ.10పెంచామని దుకాణం దగ్గర బోర్డును ఏర్పాటు చేశాడు. అయితే ఫుల్ బాటిల్, బీర్లపై కూడా అదనంగా రూ.20 వసూళ్లు చేస్తున్నాడు. ఈ విషయం ఎక్సైజ్ అధికారులకు తెలిసినప్పటికీ తమకు ఏమి తెలియనట్టు వ్యవహరిస్తున్నారు. మద్యం షాపుల దగ్గర ప్రభుత్వం నిర్ణయించిన మద్యం ధరల పట్టికను ఏర్పాటు చే యాలని మందుబాబులు డిమాండ్ చేశారు.



మద్యం షాపు దగ్గర ఏర్పాటు చేసిన బోర్డు

### బెల్టుషాపులకు డోర్ డెలివరీలు

కోడుమూరు మండలంలో బెల్టుషాపులు విచ్చలవిడిగా కొనసాగుతున్నాయి. ప్రతి గ్రామంలో రెండు, మూడు బెల్టుషాపులు పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్నాయి. మద్యం సీసాపై ఉన్న స్టిక్కర్ తీసే వేసి బెల్టు షాపులకు ఎంత కావాలంటే అంత సరుకును పంపిస్తున్నారు. లైసెన్సుదారులు బెల్టుషాపులకు డోర్‌డెలివరీ చేస్తున్నారు. ఎమ్మార్పీ ధరలకంటే క్వాటర్‌పై రూ.30 నుంచి రూ.50 వరకు, ఫుల్‌బాటిల్‌పై రూ.80 నుంచి రూ.100 వరకు, బీరుపై రూ.40 వరకు అదనంగా వసూళ్లు చేస్తున్నారు. బెల్టుషాపులు నిర్వహించినా... మద్యం ధరలు ఎమ్మార్పీ కంటే అధికంగా వసూళ్లు చేసినా ఉపేక్షించవద్దని కూటమి ప్రభుత్వం పదేపదే ఎక్సైజ్, ఎన్‌ఫోర్స్‌మెం ట్, పోలీసు యాంత్రాంగాన్ని ఆదేశిస్తోంది. మద్యం ఉల్లంఘనకు పాల్పడే షాపుకు మొదటి సారి పట్టుపడితే రూ.5లక్షలు జరిమానా, రెండో సారి పట్టుబడితే లైసెన్సు రద్దు చేయాలని ప్రభుత్వం స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. బెల్టుషాపులు, అధిక ధరలను నియంత్రించాల్సిన ఎక్సైజ్‌శాఖ, పోలీసులు మామూళ్ల మత్తులో జోగుతున్నారనే విమర్శలు ఉన్నాయి. ఇప్పటికైనా అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

### తనిఖీలు చేస్తాం



ప్రభుత్వం క్వాటర్ సీసాపై రూ.10లు పెంచింది. అయితే పాతస్టాక్ దిగుమతి చేసుకొన్నవారు వాటిపైన ఉన్న ఎంఆర్‌పీ ధరకంటే రూ.10 పెంచి విక్రయించవచ్చు. అన్ని రకాల ఫుల్ బాటిల్, బీర్ల పైన ధరలు పెంచలేదు. లైసెన్సుదారులు అధిక వసూళ్లకు పాల్పడితే చర్యలు తీసుకుంటాము. బెల్టు షాపులపై కూడా దాడులు చేస్తాం.
**- మంజుల, ఎక్సైజ్ సీఐ, కోడుమూరు**

## ఘనంగా మాళిగి నారాయణాచార్యుల శత జయంతి


సోమిశెట్టి వెంకట్రామయ్యను సత్కరిస్తున్న దృశ్యం

**కర్నూలు కల్చరల్, మార్చి 9(ఆంధ్రజ్యోతి):** జిల్లాలో వీహెచ్‌పీ స్థాపకుల్లో ఒకరైన దివంగత మాళిగి నారాయణాచార్యుల శత జయంతి కార్యక్రమాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. పాతనగరంలోని మెయిన్ బజార్ పేట రామాలయంలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో నారాయణాచార్యులతో పనిచేసిన వారిని ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఉత్తరాది మఠం మఠాధికారి రామ్మూర్తి ఆచార్యులు, వాసవి సంస్థల అధినేత సోమిశెట్టి వెంకట్రామయ్య, సీనియర్ బీజేపీ నాయకుడు నాగప్ప, వీహెచ్‌పీ మాజీ జిల్లా అధ్యక్షుడు కే కృష్ణన్న, వైద్య నిపుణుడు డాక్టర్ సీఏ సాగర్ పాల్గొన్నారు.

## మార్షల్ ఆర్ట్స్‌తో క్రమశిక్షణ

**కర్నూలు స్పోర్ట్స్, మార్చి 9 (ఆంధ్రజ్యోతి):** మార్షల్ ఆర్ట్స్‌తో క్రమశిక్షణ అలవడుతుందని మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ శమంతకమణి అన్నారు నగరంలోని కొండారెడ్డి బురుజు కేఎంసీ పార్కులో తైక్వాండో శిక్షణను తీసుకుంటున్న మార్షల్ ఆర్ట్స్‌ను ఆమె సందర్శించారు. స్పోర్ట్స్ కిట్స్ పంపిణీ చేశారు. అనంతరం తైక్వాండో క్రీడాకారులకు బ్యాగ్స్, స్పోర్ట్స్ కిట్స్ అందజేశారు. కార్యక్రమంలో కోచ్ వెంకటేశ్వర్లు, అజయ్, తేజ, మల్లేష్, విశ్వాసరావు, లలిత, తదితరులు పాల్గొన్నారు.

## గండ్లూరికి జగ్గర్లపూడి పురస్కారం


జేఎస్ఆర్‌కే శర్మ, అష్టావధాని గండ్లూరి దత్తాత్రేయ శర్మ దంపతులతో సాహితీవేత్తలు

**కర్నూలు కల్చరల్, మార్చి 9(ఆంధ్రజ్యోతి):** కర్నూలులోని ప్రముఖ తెలుగు భాషా పండితుడు, తెలుగు భాషా వికాస ఉద్యమం రాష్ట్ర కార్యదర్శి జేఎస్ఆర్‌కే శర్మ తన తల్లిదండ్రుల పేరుతో ఏర్పాటు చేసిన జగ్గర్లపూడి రాజ్యలక్ష్మి-పుల్లయ్య స్మారక పురస్కారం నంద్యాల జిల్లా డోన్‌కు చెందిన ప్రముఖ శతావధాని గండ్లూరి దత్తాత్రేయ శర్మకు అందజేశారు. ఆదివారం నగరంలోని మద్దూరునగర్‌లోగల పింగళి సూరన తెలుగుతోట సమావేశం హాలులో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఈ పురస్కారం దత్తాత్రేయ శర్మ, అన్నపూర్ణమ్మ దంపతులకు అందజేసి ఘనంగా సత్కరించారు. కర్నూలు క్లస్టర్ యూనివర్శిటీ వీసీగా సమున్నత సేవలు అందించిన ఆచార్య డీవీఆర్ సాయిగోపాల్, వాసంతి దంపతులను సాహితీవేత్తలు, విద్యావేత్తలు ఘనంగా సత్కరించి వారికి జ్ఞాపికలు ప్రదానం చేశారు.

## నగరంలో నదుల పూడ్చివేత నిలిపివేయాలి


తుంగభద్ర నదిలో వేసిన మట్టిని పరిశీలిస్తున్న కమిటీ సభ్యులు

**కర్నూలు న్యూసిటీ, మార్చి 9(ఆంధ్రజ్యోతి):** నగరంలో హంద్రీ, తుంగభద్ర నదుల పూడ్చివేతను తక్షణమే నిలిపివేయాలని తుంగభద్ర, హంద్రీ, కేసి కెనాల్ పరిరక్షణ కమిటీ కన్వీనర్ బస్తిపాడు రామక్రిష్ణ డిమాండ్ చేశారు. ఆదివారం రాజవిహార్ వద్ద హంద్రీ నదిలో, నరసింహరావుపేట, సంకల్‌బాగ్, రోజా వీధులలో తుంగభద్ర నదిని మట్టితో పూడ్చివేస్తున్న ప్రాంతాలను కమిటీ సభ్యులు పరిశీలించారు. ఈ సందర్భంగా రామక్రిష్ణ మాట్లాడుతూ తుంగభద్ర నదిలో సుమారు మూడు వందల అడుగుల లోపలికి వ్యర్థ మట్టిని నింపి పూడ్చివేస్తున్నారని అన్నారు. తక్షణమే ఈ పనులను నిలిపివేసి సరిహద్దులను నిర్ణయించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు సీపీఐ నగర కార్యదర్శి పి.రామక్రిష్ణారెడ్డి, మనోహర్‌మాణిక్యం, సుంకన్న, యోహను, నాగన్న, రత్నం ఏసుపు తదితరులు పాల్గొన్నారు.

## చేనేతలకు రాష్ట్ర బడ్జెట్‌లో రూ.2 వేల కోట్లు కేటాయించాలి



అర్ధనగ్న ప్రదర్శనగా వెళ్తున్న చేనేత కార్మిక సంఘం నాయకులు

**కర్నూలు న్యూసిటీ, మార్చి 9 (ఆంధ్రజ్యోతి) :** చేనేత కార్మికులకు రాష్ట్ర బడ్జెట్‌లో రూ.2వేల కోట్లు కేటాయించాలని ఆ సంఘం నాయకులు మాదవస్వామి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పిల్లలమర్రి నాగేశ్వరరావు డిమాం డ్ చేశారు. చేనేత కార్మిక సంఘం రాష్ట్ర సమితి పిలుపులో భాగంగా ఆదివారం సాయంత్రం చేనేత కార్మిక నాయకులు, కార్మికులు అర్ధనగ్న ప్రదర్శన నిర్వహించి కలెక్టర్ కార్యాలయం ముందు గాంధీ విగ్రహం వద్ద ధర్నా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన నాగేశ్వరరావు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల ముందు చేనేత కార్మికులకు ఇచ్చినటువంటి హామీని నిలబెట్టుకోవాలని ఎన్నికల ముందు చేనేత కార్మికులకు 200 వరకు కరెంటు యూనిట్లు ఉచితంగా ఇస్తామని చేనేత వస్త్రాలపై జీఎస్టీ తొలగిస్తామని హామీ ఇచ్చిందన్నారు. ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని వారు డిమాండ్ చేశారు. ఈ ధర్నాలో చేతివృత్తిదారుల సంఘం రాష్ట్ర కన్వీనర్ రామాంజనేయులు పాల్గొని వారికి మద్దతు తెలిపారు. కార్యక్రమంలో రైతు సంఘం రాష్ట్ర గౌరవాధ్యక్షులు రామచంద్రయ్య, కడుపు కన్నయ్య, లక్ష్మీకట్ట హేమసుందర్‌రావు సీపీఐ నగర కార్యదర్శి పి.రామకృష్ణారెడ్డి పాల్గొన్నారు.

## కర్నూలు మెడికల్ కాలేజీలో జోనల్ సీఎంఈ

**కర్నూలు హాస్పిటల్, మార్చి 9 (ఆంధ్రజ్యోతి):** కర్నూలు మెడికల్ కాలేజీలో మైక్రోబయాలజీ జోనల్ వైద్య విజ్ఞాన సదస్సు ఆదివారం మెడికల్ ఎడ్యుకేషన్ యూనిట్‌లో జరిగింది. మైక్రోబయాలజీ హెచ్‌వోడీ డా.ఏ.రేణుకాదేవి అధ్యక్షతన హ్యూమన్ మైక్రోబయోమ్‌పై సదస్సు జరిగింది. మైక్రో బయోమ్ గురించి వైస్ ప్రిన్సిపాల్ డా.ఏ.రేణుకాదేవి, క్యాన్సర్ వైద్య నిపుణులు డా.కే.శివప్రసాద్, డా.కుముద, డా.నాగజ్యోతి, డా.చక్రపాణి వివరించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న కర్నూలు జీజీహెచ్ సూపరింటెండెంట్ డా.కే.వెంకటేశ్వర్లు, వైద్య విజ్ఞాన సదస్సు వల్ల విద్యార్థులు తమ నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డా.సాయిసుధీర్, డా.సోమశేఖర్, డా.జే.విజయలక్ష్మి పాల్గొన్నారు.

## జిల్లా మహాసభలను జయప్రదం చేయండి


సమావేశంలో మాట్లాడుతున్న గుణశేఖర్

**కోడుమూరు, మార్చి 9(ఆంధ్రజ్యోతి):** ఏపీ రజక వృత్తిదారుల సంఘం జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని రజక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి గుణశేఖర్ అన్నారు. సీపీఎం కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కోడుమూరు పట్టణంలో తుల్జాభవాని దేవాలయంలో 22న రజక సంఘం 6వ జిల్లా మహాసభలను విజయవంతం చేయాలని అన్నారు. స్వాతం త్రం వచ్చి 77 సంవత్సరాలు అయినప్పటికీ రజకుల సామాజిక, ఆర్థిక, రాజకీయంగా ఎదగలేదన్నారు. కార్యక్రమంలో రజక సంఘం నాయకులు రామలింగప్ప, నాగరాజు, మద్దిలేటి, రాముడు, సుంకన్న, పాల్గొన్నారు.

## ఉచితంగా కంటి వైద్య శిబిరం


గ్రామస్తులతో మాట్లాడుతున్న కంటి వైద్యుడు డాక్టర్ ప్రవీణ్ జేజే

**కర్నూలు కల్చరల్, మార్చి 9(ఆంధ్రజ్యోతి):** నగరంలోని నంద్యాల చెక్‌పోస్టు సమీపంలోగల జయలక్ష్మి నేత్రాలయ కంటి ఆసుపత్రి ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. కర్నూలు నగర శివారులోని కె.నాగలాపురంలోని సుంకులమ్మ గుడి వద్ద ఈ శిబిరం ఏర్పాటు చేశారు. ఈ శిబిరంలో జయలక్ష్మి నేత్రాలయం కంటి వైద్య నిపుణుడు డాక్టర్ ప్రవీణ్ జేజే, గ్రామ సర్పంచ్ జె.నయోమి, గ్రామ పెద్దలు గోపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. 35 మందికి కంటిలో శుక్లాలు ఉన్నట్లు గుర్తించి, వారికి ఉచితంగా కంటి శుక్లాల తొలగింపు ఆపరేషన్లు చేస్తామని తెలిపారు.

## శ్రీవారికి వెండి కిరీటం


స్వామి వారికి వెండి కిరీటం అందజేస్తున్న భక్తురాలు బోయ పద్మావతి

**కర్నూలు కల్చరల్, మార్చి 9(ఆంధ్రజ్యోతి):** నగరంలో సంకల్‌బాగ్‌లో గల శ్రీదేవీ భూదేవీ సమేత వేంకటేశ్వర స్వామి దేవాలయం, భవానీ సమేత రామలింగేశ్వర ఆలయం (హరిహర క్షేత్రం)లో గల శ్రీవారికి నగరానికి చెందిన బోయ పద్మావతి అనే భక్తురాలు వెండి కిరీటం అందజేశారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు సండేల్ చంద్రశేఖర్ చేతుల మీదుగా ఈ కిరీటాన్ని స్వామివారికి కానుకగా ఇచ్చారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు ఎస్ శ్రీనివాసరాజు, ఆకెళ్ల రాధాకృష్ణ పాల్గొన్నారు.

# రాలుతున్న ఆశలు..!

- మామిడికి తెగుళ్లు
- రైతన్నల గుండెల్లో గుబులు
- నేలపాలైన మామిడి పిందెలు
- అడ్రస్ లేని ఉద్యాన శాఖ అధికారులు


పూత లేని మామిడి చెట్లు

**ఓర్వకల్లు, మార్చి 9 (ఆంధ్రజ్యోతి):** మామిడి తోటలకు బూడిద తెగుళ్లు, తేనేమంచు తెగుళ్ల సోకడంతో పూత, మామిడి పిందెలు రాలుతున్నాయి. దీంతో రైతులు, కౌలు రైతులు ఆందోళన చెందుతున్నారు. మండలంలోని పాలకొలను, ఉయ్యాలవాడ, చెన్నంచెట్టిపల్లి, కాల్వ, బ్రాహ్మణపల్లె, కాల్వబుగ్గ, బేతంచెర్ల మండలంలోని ఎంబాయి, రుద్రవరం తదితర గ్రామాల్లో 5వేల ఎకరాలకు పైగా మామిడితోటలు ఉన్నాయి. అయితే ఈ ఏడాది పూత కళకళలాడుతుండటంతో కౌలు రైతులు ఎగబడి రూ.లక్షల్లో మామిడి చెట్లను కౌలుకు తీసుకున్నారు. కౌలురైతులు రైతులకు ముందుగుత్త డబ్బులు చెల్లించారు. కాస్తో .. కూస్తో ఉన్న పూతను, మామిడి పిందెలను కాపాడుకునేందుకు వివిధ రకాల పురుగు మందులు పిచికారి చేసినా ప్రయోజనం లేదని రైతులు వాపోతున్నారు. అయితే ఎండలు అధికంగా ఉండటంతో దీనికి తోడు తెగుళ్ల సోకడంతో పూత, మామిడి పిందెలు రాలుతున్నాయని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పంటపై పెట్టిన పెట్టుబడులు కూడా వచ్చే పరిస్థితులు లేవు.


రాలిపోయిన మామిడి కాయలు

### 15 ఎకరాలు కౌలుకు తీసుకున్నా



15 ఎకరాల్లో మామిడితోటను రూ.10 లక్షలతో కౌలుకు తీసుకున్నా. ఆ రైతుకు డబ్బంతా చెల్లించాను. ఫిబ్రవరిలో మామిడిపూత బాగా ఉండడంతో కొనుగోలు చేశాం. ఎండలు అధికం కావడం, పూత, పిందే రాలిపోవడంతో ఆందోళన కలిగిస్తోంది.
**- వెంకటరమణ, కౌలు రైతు**

### రైతులను ఆదుకోవాలి



ఈ ఏడాది తెగుళ్ల బెడదతో మామిడి రైతులు, కౌలు రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. అయితే.. కాస్తో.. కూస్తో పంట చేతికొచ్చే సమయంలో అకాల వర్షాలతో ఉన్న మామిడికాయలు కూడా నేలపాలవుతున్నాయి. మామిడి రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి
**- రామగోవిందు, రైతు**

### ● తీవ్రంగా నష్టపోతున్నాం



తెగుళ్ల బెడదతో తీవ్రంగా నష్టపోతున్నాం. పూత బాగానే ఉన్నా.. కాయలు రాలిపోతున్నాయి. ప్రభుత్వం నష్టపోయిన కౌలు రైతులను ఆదుకోవాలి.
**- రామసుబ్బయ్య, కౌలు రైతు**

## వ్యవసాయాధికారుల సంఘం ట్రెజరర్‌గా నరసింహులు

**కర్నూలు అగ్రికల్చర్, మార్చి 9 (ఆంధ్రజ్యోతి):** జిల్లా వ్యవసాయ విస్తరణాధికారుల సంఘం కోశాధికారిగా మంత్రాలయం చెందిన నరసింహులును ఏకగ్రీవంగా సంఘం సభ్యులు ఎన్నుకున్నారు. ఆదివారం కలెక్టరేట్‌లో సంఘం కార్యవర్గ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన రాష్ట్ర కార్యదర్శి నాగేశ్వరరెడ్డి మాట్లాడుతూ కోశాధికారిగా ఎన్నికైన నరసింహులును అభినందించారు. సంఘం సభ్యులు ఎటువంటి సమస్యలనైనా తమ దృష్టికి తీసుకురావాలని వాటి పరిష్కారానికి ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తామని హామీ ఇచ్చారు.

బిజినెస్ అవకాశం
ఎటువంటి పెట్టుబడి లేకుండా ఎక్కువ లాభాలు (ఆదాయం) సంపాదించే మంచి అవకాశం
కర్నూలులో
ఇంటర్వ్యూ తేది: 11-03-2025
& మీటింగ్: 12-03-2025
Cell:81254 73657
92461 55128
B.N.V. Krishna
Director
Motivational Speaker
SRIPADARAM MADUNOORI

## మహిళల స్వావలంబన దిశగా చంద్రన్న అడుగులు

● టీడీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు మల్లెల రాజశేఖర్


హుశేనాపురంలో రాజశేఖర్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న మహిళలు

**ఓర్వకల్లు, మార్చి 9 (ఆంధ్రజ్యోతి):** మహిళా ఆర్థిక స్వావలంబనే దిశగా రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అడుగులు వేస్తున్నారని నంద్యాల టీడీపీ జిల్లా అధ్యక్షుడు, టీటీడీ బోర్డు సభ్యుడు మల్లెల రాజశేఖర్ అన్నారు. ఆదివారం మండలంలోని హుశేనాపురం గ్రామంలో పొదుపు సంఘాల మహిళలతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మహిళలను ఆర్థికంగా అభివృద్ధికి తెచ్చేందుకు వారి కాళ్లపై వారు నిలబడేలా సహకార సంఘాలను సీఎం చంద్రబాబు నాయుడు ఏర్పాటు చేసి మానసిక ధైర్యాన్ని పెంపొందించడం జరిగిందన్నారు. మహిళలకు అత్యధిక గౌరవమిచ్చే పార్టీ టీడీపీదే అన్నారు. మహిళలు, పిల్లల భద్రత కోసం ముఖ్యమంత్రి శక్తి బృందాలను ప్రారంభించారన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 1.50 లక్షల మంది మహిళలకు ఉచితంగా కుట్టుమిషన్లు పంపిణీ చేసే కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి ప్రారంభించారన్నారు. ఈ కార్యక్రమంలో పొదుపు మహిళలు పాల్గొన్నారు.

## ఎస్‌ఐని సస్పెండ్ చేయాలి


గూడూరులోని పాత బస్టాండ్ వద్ద రాస్తారోకో చేస్తున్న హిందూ పరివార సంఘాల నాయకులు

**గూడూరు, మార్చి 9 (ఆంధ్రజ్యోతి):** రాయచోటి ఎస్ఐను సస్పెండ్ చేయాలని హిందూ పరివార సంఘాలు డిమాండ్ చేశారు. అన్నమయ్య జిల్లా రాయచోటిలో వీరభద్రస్వామి పారువేట ఊరేగింపును ఒక వర్గం వారు అడ్డుకున్నందుకు గాను గూడూరులో హిందూ పరివార సంఘాల ఆధ్వర్యంలో ఆదివారం గూడూరులో రోడ్డుపై బైఠాయించి నిరసన చేపట్టారు. ఉమ్మడి కర్నూలు జిల్లా గ్రామ వికాస సమితి ప్రముఖ్ డమాం సురేష్, భాజాపా జిల్లా ప్రధాన కార్యదర్శి మల్లేష్ నాయుడు, భజరంగ్‌దళ్ జిల్లా కన్వీనర్ రాజేష్ మాట్లాడుతూ అన్నమయ్య జిల్లాలోని రాయచోటిలో వీరభద్రస్వామి ఉత్సవాన్ని నిర్వహించరాదని ఒక వర్గం వారు మరొక వర్గం వారిపై దాడి చేయడం సరికాదన్నారు. అలాగే దాడి చేసిన వారిని శిక్షించకుండా రాయచోటి ఎస్ఐ దాడికి గురైన వారిపైనే తప్పుడు కేసులు పెట్టారన్నారని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో హిందు సంఘాల నేతలు కిరణ్, నటరాజ్, బీజేపీ మండలాధ్యక్షుడు వెంకటేష్, హరి, మధుతారక్, ఆనంద్, శివరాముడు తదితరులు పాల్గొన్నారు.



నాడు దిగబడి

ఆలూరు-కర్నూలు మార్గంలో పెద్ద హోతూరు గ్రామ సమీపంలో రోడ్డు గుంతలు పడి వాహనదారులు అవస్థలు పడేవారు. ఏమాత్రం అజాగ్రత్తగా ఉన్నా ప్రమాదాలు చోటుచేసుకునే అవకాశం ఉండేది. అయితే కూటమి ప్రభుత్వం వచ్చిన వెంటనే రహదారులకు నిధులు కేటాయించడంతో ఆర్అండ్‌బీ అధికారులు మరమతులు చేయించారు. వాహనదారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.




నేడు బాగుపడి

## ఆవిర్భావ దినోత్సవాన్ని విజయవంతం చేయాలి

**మద్దికెర, మార్చి 9 (ఆంధ్రజ్యోతి):** ఈ నెల 14న పిఠాపురంలో నిర్వహించనున్న జనసేన ఆవిర్భావ దినోత్సవాన్ని విజయవంతం చేయాలని ఆ పార్టీ నాయకుడు వై.క్రాంతి కుమార్ కోరారు. ఆదివారం మద్దికెరలో మాట్లాడుతూ పార్టీ అధ్యక్షుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ వస్తున్నారని, కార్యకర్తలు తరలిరావాలని పిలుపునిచ్చారు.

## నాణ్యమైన భోజనం వడ్డించాలి



విద్యార్థులతో మాట్లాడుతున్న లింగప్ప

**ఆదోని అగ్రికల్చర్, మార్చి 9 (ఆంధ్రజ్యోతి):** ఎస్సీ బాలుర హాస్టల్-1 విద్యార్థులకు నాణ్యమైన పౌష్టికాహారాన్ని వడ్డించాలని ఎస్ఎఫ్ఐ పట్టణ అధ్యక్షుడు లింగప్ప డిమాండ్ చేశారు. ఆదివారం హాస్టల్ విద్యార్థులతో మాట్లాడారు. వార్డెన్ వంట మనుషులతో కుమ్మక్కై సరైన భోజనాన్ని పెట్టడం లేదని ఆరోపించారు. అన్నంలో పురుగులు వస్తున్నాయని నీళ్ల చారుతో వడ్డిస్తున్నట్లు విద్యార్థులు అన్నారని తెలిపారు. సాంఘిక సంక్షేమ అధికారులు విచారణ చేసి, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

## మహిళా కౌన్సిలర్ మృతి



రామ లక్ష్మమ్మ(ఫైల్)

**ఆదోని టౌన్, మార్చి 9 (ఆంధ్రజ్యోతి):** కల్లుబావి 23వ వార్డు కౌన్సిలర్ రామలక్ష్మమ్మ (75) ఆదివారం మృతి చెందారు. 2021లో వైసీపీ తరపున సమీప అభ్యర్థిపై 800ఓట్ల అధిక్యతతో గెలుపొందారు. కొంతకాలంగా అనారోగ్య కారణాలతో కర్నూలులో చికిత్స పొందుతూ, కోలుకోలేక ఆదివారం మృతి చెందారు. ఆమె మృతి పట్ల మాజీ ఎమ్మెల్యే సాయి ప్రసాద్ రెడ్డి, కౌన్సిలర్లు సంతాపం తెలిపారు.

## వివాహ వేడుకల్లో ప్రముఖులు



వధూవరులను ఆశీర్వదిస్తున్న కేఈ ప్రభాకర్

**పత్తికొండ టౌన్, మార్చి 9 (ఆంధ్రజ్యోతి):** పట్టణంలోని గోపాల్ ప్లాజాలో ఆదివారం జరిగిన టీడీపీ కార్యనిర్వహక కార్యదర్శి తుగ్గలి నాగేంద్ర సోదరుడి కుమారుడి వివాహ వేడుకలకు రాజకీయ ప్రముఖులు హాజరయ్యారు. తుగ్గలి నాగేంద్ర సోదరుడు వరప్రసాద్ కుమారుడు అనిల్ కుమార్, హేమశ్రీ పెళ్లికి మాజీ మంత్రి కేఈ ప్రభాకర్, పారిశ్రామికవేత్త కేఈ హరిబాబు, వాల్మీకి కార్పొరేషన్ చైర్‌పర్సన్ కప్పట్రాళ్ల బొజ్జమ్మ దంపతులు, మంత్రాలయం, ఆలూరు టీడీపీ ఇన్‌చార్జిలు రాఘవేంద్రరెడ్డి, వీరభద్రగౌడ్, ఆదోని మాజీ ఎమ్మెల్యే సాయిప్రసాద్ రెడ్డి, గుంతకల్లు మాజీ ఎమ్మెల్యే నైరుతారెడ్డి, జడ్పీ మాజీ చైర్మన్ బత్తిన వెంకట్రాముడు, సాంబశివారెడ్డి, పాల్గొన్నారు.

## సభ్యత్వం నమోదు చేసుకోండి



కరపత్రాలు విడుదల చేస్తున్న నాయకులు

**వెల్దుర్తి, మార్చి 9 (ఆంధ్రజ్యోతి):** రైతులు, రైతు కూలీలు రైతు సంఘంలో సభ్యత్వం నమోదు చేసుకోవాలని ఆ సంఘం కార్యదర్శి కె.జగన్నాథం కోరారు. ఆదివారం మండలంలోని నరసాపురం, బోయినపల్లె గ్రామాల్లో సభ్యత్వ నమోదు చేయించారు. సీపీఐ కార్యదర్శి కృష్ణ, రైతు సంఘం అధ్యక్షుడు రాజు, వ్యవసాయ సంఘం అధ్యక్షుడు వెంకటేశ్వర్లు, చరణ్ పాల్గొన్నారు.

## విజయవంతం చేయాలి

**పత్తికొండ టౌన్, మార్చి 9 (ఆంధ్రజ్యోతి):** ఈ నెల 12న తలపెట్టిన చలో విజయవాడను విజయవంతం చేయాలని వ్యవసాయ సంఘం జిల్లా కార్యదర్శి నారాయణ, సీపీఎం కార్యదర్శి వెంకటేశ్వరరెడ్డి పిలుపునిచ్చారు. ఆదివారం ఈశ్వర్ రెడ్డి భవన్‌లో కరపత్రాలు విడుదల చేశారు. ఉపాధి హామీ పథకానికి బడ్జెట్‌లో నిధులు తగ్గించడంతో నెలల తరబడి వేతనాలు పెండింగ్ ఉన్నాయన్నారు. దస్తగిరి, నరసన్న, బుచ్చులు, శిఖామణి, తిరుపాలు పాల్గొన్నారు.

## 17 నుంచి ఉచిత ఎంసెట్ కోచింగ్

**ఆదోని అగ్రికల్చర్, మార్చి 9 (ఆంధ్రజ్యోతి):** ఈనెల 17 నుంచి ఇంటర్మీడియట్ పూర్తిచేసిన విద్యార్థులకు ఉచిత ఎంసెట్ శిక్షణ ఇవ్వనున్నట్లు ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీనివాసులు తెలిపారు. స్థానిక విశ్వ నారాయణ జూనియర్ కళాశాలలో ఏప్రిల్ 25వ తేదీ వరకు శిక్షణ ఉంటుందన్నారు. వివరాలకు 9052166745, 9515291609లో సంప్రదించి పేర్లు నమోదు చేసుకోవాలన్నారు.

## మేధావుల ఫోరం ప్రతినిధిగా శ్రీరంగడు

**పత్తికొండ టౌన్, మార్చి 9 (ఆంధ్రజ్యోతి):** వైసీపీ మేధావుల ఫోరం రాష్ట్ర అధికార ప్రతినిధిగా పత్తికొండ కు చెందిన శ్రీరంగడు ఎన్నికయ్యారు. ఈమేరకు ఆదివారం పార్టీ కేంద్ర కార్యాలయం నుంచి ఆదేశాలు అందాయి. తనకు అవకాశమిచ్చినందుకు శ్రీరంగడు పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్, జిల్లా అధ్యక్షుడు ఎస్వీ మోహన్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే శ్రీదేవికి కృతజ్ఞతలు తెలిపారు.

## వైద్య విద్యను దూరం చేయొద్దు

**పత్తికొండ టౌన్, మార్చి 9 (ఆంధ్రజ్యోతి):** ఆంధ్రప్రదేశ్‌లో పేద విద్యార్థులకు వైద్య విద్యను దూరం చేయొద్దని కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి క్రాంతి నాయుడు డిమాండ్ చేశారు. ఆదివారం మాట్లాడుతూ ప్రభుత్వ వైద్య కళాశాలను కార్పొరేట్ అప్పజెప్పితే విద్యాప్రమాణాలు పూర్తిగా నాశనం అవుతాయన్నారు.

## రాయల ఆశయ సాధనకు కృషి చేద్దాం

**ఆదోని అగ్రికల్చర్, మార్చి 9 (ఆంధ్రజ్యోతి):** సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ ఉమ్మడి ఏపీ కేంద్ర కమిటీ సభ్యుడు కార్యదర్శి రాయల సుభాష్ చంద్రబోస్ ఆశయ సాధనకు కృషి చేయాలని జిల్లా కార్యదర్శి మల్లికార్జున అన్నారు. ఆదివారం 9వ వర్ధంతి సందర్భంగా నివాళులర్పించారు. శ్రీకాకుళం రైతుల కోసం ప్రజల పక్షాన పోరాడి అనారోగ్యంతో మృతి చెందారన్నారు. మణి, రాజు, అఖండ, వెంకప్ప, నారాయణ, ఈరన్న, రసూల్ పాల్గొన్నారు.

# విద్యార్థుల జీవితాలతో ప్రభుత్వం చెలగాటం

- మాజీ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి, ఆలూరు ఎమ్మెల్యే విరుపాక్షి
- యువత పోరు పోస్టర్ల విడుదల





మద్దికెరలో పోస్టర్లను విడుదల చేస్తున్న మాజీ ఎమ్మెల్యే శ్రీదేవి, ఆలూరులో ఎమ్మెల్యే విరుపాక్షి

**మద్దికెర, మార్చి 9 (ఆంధ్రజ్యోతి):** విద్యార్థుల జీవితాలతో కూటమి ప్రభుత్వం చెలగాటమాడుతోదని మాజీ ఎమ్మెల్యే కే.శ్రీదేవి అన్నారు. ఆదివారం మద్దికెరలో వైసీపీ ఆధ్వర్యంలో చేపడుతున్న యువత పోరు పోస్టర్లను విడుదల చేశారు. ఫీజు రీయింబర్స్‌మెంట్, వసతి దీవెన కింద విద్యార్థులకు ఇవ్వాల్సిన రూ.4,600 కోట్లు బకాయిలు తక్షణమే విడుదల చేయాలన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు నిరుద్యోగులకు నెలకు రూ.3వేలు నిరుద్యోగ భృతి వెంటనే ఇవ్వాలని డిమాండ్ చేశారు. మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణ ప్రయత్నాలను ఉపసంహరించుకుని, పేద విద్యార్థులకు వైద్య విద్యను అందుబాటులో ఉంచాలన్నారు. వైసీపీ నాయకులపై కక్ష సాదింపు చర్యలకు పాల్పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నెల 12న కలెక్టరేట్ ముందు జరిగే యువత పోరుకు తరలిరావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎంపీపీ అనిత, కన్వీనర్ మల్లికార్జున యాదవ్, మాజీ ఎంపీటీసీ శ్రీనివాసులు, పంచాయతీ సలహాదారులు బండారు ఆంజనేయులు, వైసీపీ నాయకులు రేవప్ప, కవిరెడ్డి కృష్ణ, వీరేష్, బాలచంద్ర, వెంకట్రాముడు, ఆంజనేయులు ఉన్నారు.

**హామీల అమలులో నిర్లక్ష్యం: ఎమ్మెల్యే**

**ఆలూరు రూరల్:** ఎన్నికల్లో ఇచ్చిన హామీల అమలును కూటమి నిర్లక్ష్యం చేస్తోందని ఎమ్మెల్యే విరుపాక్షి ఆరోపించారు. ఆదివారం పట్టణంలోని ఆర్అండ్‌బీ గెస్ట్‌హౌస్‌లో యువత పోరు పోస్టర్లను విడుదల చేశారు. అధికారంలోకి రాగానే పెండింగ్ రూ.4,600 కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లిస్తామని, నిరుద్యోగ భృతి, డీఎస్సీ ప్రకటకిస్తామని చెప్పి చేయలేదన్నారు. కన్వీనర్ మల్లికార్జున కో కన్వీనర్ వీరేష్, నాయకులు వెంకటేశ్వర్లు భాస్కర్ నాయుడు, కురవళ్ళి శివ హనుమంతు, రామ్ గోపాల్, జె.వీరేష్, వెంకటేష్ పాల్గొన్నారు.

## కంటి వైద్య శిబిరం



ఆదోనిలో కంటి పరీక్షలు చేస్తున్న వైద్యులు

**ఆదోని టౌన్, మార్చి 9 (ఆంధ్రజ్యోతి):** ఆవోపా ఆధ్వర్యంలో ఆదివారం భారతి హైస్కూల్‌లో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. 185 మందికి శాంతి రామ్ హాస్పటల్ (నంద్యాల), ఎన్‌టీఆర్ వైద్య సేవ వైద్యులు కంటి పరీక్షలను నిర్వహించి 68 మందికి శస్త్ర చికిత్స చేసేందుకు నిర్ణయించారు. రోగులకు ప్రయాణ, భోజన, వసతి ఖర్చులను శిబిర సౌజన్యకర్త కాకుబాల్ నగేష్ భరిస్తారని ఆవోపా కార్యదర్శి వంకదారు శ్రీనాథ్ గుప్తా తెలిపారు. యతగిరి వెంకటేషులు, ప్రతాప్ ఈరన్న, శెట్టి రాజేష్, రాధాకృష్ణ, వంకదారు మమతా శ్రీ, అనిత, సంతోష్, మీనాక్షీ పాల్గొన్నారు.



కప్పట్రాళ్ల గ్రామంలో పరీక్షలు చేస్తున్న వైద్యులు

**కప్పట్రాళ్లలో వైద్య శిబిరం**

**దేవనకొండ:** ప్పట్రాళ్ల గ్రామంలో సత్యసాయిసేవా సంస్థ ఆధ్వర్యంలో వైద్యశిబిరం నిర్వహించారు. దత్త పుత్రుడు, ఈగల్ ఐజీ రవికృష్ణ పిలుపు మేరకు ఎంపీపీ పాఠశాల వద్ద కంటి ఎముకలు, మహిళ సమస్యలపై పరీక్షలు నిర్వహించారు. వైద్యులు శృతి, రవిబాబు, మల్లేశ్వరి, ఎస్‌వి చంద్రశేఖర్, అనిల్ కుమార్, నాగరాజు, వాల్మీకి ఫెడరేషన్ చైర్‌పర్సన్ బొజ్జమ్మ, సీఐ వంశీనాథ్, ఏవో అక్బర్, గ్రామస్థులు గంగన్న, చింపిఈరన్న, తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే పూజలు

**ఆలూరు, మార్చి 9 (ఆంధ్రజ్యోతి):** మండలంఓని కరిడిగుడ్డెం గ్రామంలో మంగమాంబ ఆలయలో ఎమ్మెల్యే విరుపాక్షి ఆదివారం ప్రత్యేర పూజలు చేశారు. ఆలయ అభివృద్ధికి కృషి చేస్తానని ఆయన హామీ ఇచ్చారు.

# ఘనంగా పట్టా దేవర, రథోత్సవం

- హొళగుంద. ఆస్పరి, ఆలూరు మండలాల్లో ప్రత్యేక పూజలు
- నెరణికిలో 18 జంటలకు సామూహిక వివాహాలు



మగువల వేషధారణలో పురుషులు



నేరణికిలో ఊరేగింపుగా వెళ్తున్న భీరప్ప స్వామి ఉత్సవమూర్తులు



ఆలూరు మండలం కరడిగూడ్డంలో రథోత్సవం

**హొళగుంద, మార్చి 9 (ఆంధ్రజ్యోతి):** మండలంలోని నేరణికి గ్రామంలో నేరణికి లింగేశ్వర స్వామి దేవర ఆదివారం నిర్వహించారు. ఉత్సవ మూర్తులను డప్పు వాయిద్యాల మధ్య గ్రామంలో ఊరేగించారు. స్వామి వార్లను 18 జంటలకు సామూహిక వివాహం నిర్వహించినట్లు నిర్వాహకులు తెలిపారు. దేవరగట్టు మాళ మల్లేశ్వర ఆలయంలో ఆదివారం స్వామి అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నట్లు పూజారి మల్లికార్జున స్వామి తెలిపారు.

**మన్మథుడి వేషధారణ...**

స్థానిక ఉరవకొండ మఠంలో కమన్న (మన్మథుడు) వేడుకల్లో భాగంగా మూడవ రోజు లంబాడి నృత్యాలు ఆకట్టుకున్నాయి. జాంటి వీరేష్ ఆధ్వర్యంలో యువకులు యువతుల వస్త్రాలు ధరించి లంబాడి పాటలు పాడుతూ నృత్యాలు చేశారు.

**రమణీయం మంగమాంబ దేవి రథోత్సవం**

**ఆలూరు రూరల్:** మండలంలోని కరిడిగూడ్డం కమ్మరచేడు గ్రామాల్లో మంగమాంబ దేవి రథోత్సవం ఆదివారం సాయంత్రం సాగింది. ఉదయం అర్చకుడు శ్రీనివాసులు అమ్మవారికి ప్రత్యేక పూజలను చేశారు. మంగమాంబ దేవి రథోత్సవం సందర్భంగా ఆంధ్ర, కర్ణాటక భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి మొక్కులు సమర్పించారు. సాయంత్రం రథాన్ని లాగారు. ఆలూరు ఎస్సై దిలీప్ కుమార్ బందోబస్తు ఏర్పాటు చేశారు. టీడీపీ రైతు కమిటీ రాష్ట్ర కార్యదర్శి నారాయణ రెడ్డి, జడ్పీటీసీ ఏరూరు శేఖర్, సర్పంచులు సుధాకర్ రెడ్డి, సుమతి రెడ్డి, దేవిరెడ్డి, కురువ దేవేంద్రప్ప, తిమన్న గౌడ్, చంద్రశేఖర్ రెడ్డి, ఆరోగ్య స్వామి పాల్గొన్నారు.

**సుంకలమ్మ దేవి ఆలయ వార్షికోత్సవ పూజలు**

ఆలూరు పట్టణంలోని కోట వీధి సుంకలమ్మ ఆలయం 8వ వార్షికోత్సవం ఆదివారం నిర్వహించారు. ఉదయం సుంకలమ్మ దేవికి కుంకుమ అర్చన, పంచామృతషేకం, పెరుగు అన్నం నైవేద్యం, మహా మంగళ హారతి వంటి ప్రత్యేక పూజలను అర్చకులు రామాంజినేయులు నరేష్‌లు చేశారు.

**కదిరప్ప స్వామి కల్యాణోత్సవం**

**తుగ్గలి:** కడమకుంట్ల, రోళ్లపాడు తాండ శివార్లలో కదిరప్ప స్వామి కల్యాణం ఆదివారం నిర్వహించారు. పూజారి వెంకటేశ్వర్లు వేద మంత్రోచ్చరణాలతో యజ్ఞ యాగాలు చేశారు. సాయంత్రం అశేష భక్తుల మధ్య స్వామివారి ఉత్సవ విగ్రహాలను ఊరేగించారు. టీడీపీ నాయకులు ఫక్కీరప్ప, తులసి నాయక్, శ్రీను నాయక్ తదితరులు పాల్గొన్నారు.

**ఘనంగా తిమ్మన్న తాత ఉరుసు**

**ఆస్పరి:** కల్లపరి గ్రామంలో తిమ్మన్న తాత ఉరుసు ఉత్సవాలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. దర్గాలో ప్రత్యేక పూజలు చేశారు. తాత గుర్రాన్ని గ్రామ పురవీధుల గుండా ఊరేగించారు. దర్మకర్త సాయద్ తాత, గొల్ల వెంకటేష్, ఓబులేష్, వీరభద్రి, శ్రీనువాసు, రమేష్, ఎర్రమ్మ పాల్గొన్నారు.

## చంద్రబాబు బీసీల పక్షపాతి

**మద్దికెర, మార్చి 9 (ఆంధ్రజ్యోతి):** సీఎం చంద్రబాబు బీసీల పక్షపాతి అని తెలుగు యువత ఉపాధ్యక్షుడు మూలింటి రాము యాదవ్, మాజీ ఎంపీటీసీ పులిశేఖర్ అన్నారు. ఆదివారం పెరవలి గ్రామంలో మాట్లాడుతూ బీసీ కార్పొరేషన్ ద్వారా రుణాలు మంజూరు చేశారన్నారు. వైసీపీ బీసీలకు రుణాలు రాలేదని, టీడీపీ బీసీలకు 50 శాతం రాయితీతో రుణాలు అందిస్తుందన్నారు.

## టీడీపీతోనే లింగాయత్‌ల అభివృద్ధి

**తుగ్గలి, మార్చి 9 (ఆంధ్రజ్యోతి):** తెలుగుదేశం పార్టీతోనే లింగాయత్‌లు అభివృద్ధి చెందుతారని ఆ పార్టీ నాయకుడు బాదడ కౌశిక్ కుమార్ అన్నారు. ఆదివారం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ టీడీపీ గెలుపు కోసం పని చేసిన లింగాయత్‌ల అభివృద్ధికి సీఎం చంద్రబాబు కృషి చేస్తున్నారన్నారు. ఎమ్మెల్యే శ్యాంబాబు లింగాయత్‌లు మరింత అభివృద్ధి చెందేలా కృషి చేస్తారన్నారు.

## దాడిచేసిన వారిపై చర్య తీసుకోవాలని

**ఆదోని టౌన్, మార్చి 9 (ఆంధ్రజ్యోతి):** రాయచోటిలో వీరభద్ర స్వామి పారువేటలో దాడులు చేసినవారిపై చర్యలు తీసుకోవాలని వీహెచ్‌పీ ప్రముఖ్ ప్రతాప్ రెడ్డి డిమాండ్ చేశారు. ఆదివారం కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు బసవన్న గౌడ్‌తో కలిసి విలేకరుల సమావేశం నిర్వహించారు. సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ జోక్యం చేసుకొవాలన్నారు. సోమవారం సబ్ కలెక్టర్ కార్యాలయం వరకు ర్యాలీ ఉంటుందన్నారు.

## ఆలయంలో బోరు



బోరు మిషన్ స్విచ్చాన్ చేస్తున్న మాజీ ఎంపీపీ

**వెల్దుర్తి, మార్చి 9(ఆంధ్రజ్యోతి):** స్థానిక రేణుకా ఎల్లమ్మ ఆలయంలో మాజీ ఎంపీపీ జ్ఞానేశ్వర్ గౌడ్ బోరు వేయించారు. భక్తుల సౌకర్యార్థం బాత్‌రూమ్‌లు, టాయిలెట్ల నిర్మాణానికి భూమి పూజ చేశారు. ఎమ్మెల్యే శ్యాం బాబు సహకారంతో మండలంలో అభివృద్ధి పనులు చేస్తున్నామన్నారు. పూజారి గురుస్వామి, వెంకటేశ్వర్లు, హరి పాల్గొన్నారు.

# రేపటి నుంచి రంగనాథ స్వామి బ్రహ్మోత్సవాలు



పెరవలి రంగనాథ స్వామి ఆలయం

**మద్దికెర, మార్చి 9 (ఆంధ్రజ్యోతి):** మండలంలోని పెరవలి గ్రామంలో వైష్ణవ పుణ్య క్షేత్రమైన రంగనాథ స్వామి బ్రహోత్సవాలు మంగళవారం ప్రారంభ కానున్నాయి. ఆలయంలో ఏటా పాల్గుణ శుద్ధ ద్వాదశి నుంచి బహుళ సప్తమి వరకు స్వామివారి కళ్యాణం, రథోత్సవం, అలంకరణతో పాటు వసంతోత్సవం నిర్వహిస్తారు. 11న ధ్వజారోహణం, 12న సింహోత్సవం, 13న శేషోత్సవం, 14న లంకోత్సవం, 15న గరుడోత్సవం, 16న గజోత్సవం, 17న ఉదయం మూలవిరాట్ రంగనాథస్వామి, భూదేవి శ్రీదేవి కల్యాణం హోమం, మధ్యాహ్నం భక్తులకు అన్నదానం, సాయంత్రం రతోత్సవం రాత్రి సాంస్కృతిక కార్యక్రమాలు, 18న అశ్వవాహన సేవ, 19న హంస వాహనం, 20న పానుపు సేవ, వసంతోత్సవంతో ఉత్సవాలు ముగుస్తాయి.

**ఆలయ చరిత్ర..**

వైకుంఠ ద్వారంలో ఆలయంలో రంగనాథ స్వామి, భూదేవి రాజ్యలక్ష్మి సమేతుడై పూజలందుకుంటున్నారు. ద్వాదశ ఆలువారునుతో వెలసిన దివ్య వైష్ణవ క్షేత్రం ఎందరో రుషులు తపస్సు చేసి వారు దర్శనార్థం శ్రీమన్నారాయణుడు కపిల మహర్షి అవతారంలో వచ్చి ఇక్కడ రంగనాథస్వామి వారి సాలా గ్రామాన్ని ఏర్పాటు చేసినట్లు పురాణాలు చెబుతున్నాయి. 1536-37 మధ్య విజయనగర రాజులు, హరిహర రాయులు, బుక్కరాయలు ఆలయాన్ని నిర్మించినట్లు తెలుస్తోంది. మాన్యం ద్వారా వచ్చే ఆదాయం, భక్తుల విరాళలతో అభివృద్ధి చేస్తారు.

**అన్ని ఏర్పాట్లు పూర్తి**



ఈ నెల 11 నుంచి బ్రహ్మోత్సవాల సందర్భంగా భక్తులకు అన్ని ఏర్పాట్లు చేశాం. రాత్రివేళల్లో కాలక్షేపానికి హరికథలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. భక్తులకు అన్నదానం చేస్తాం. **- వీరయ్య ఈవో, పెరవలి**

# వేసవిలో వడదెబ్బ పట్ల జాగ్రత్తగా ఉండాలి

**ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ**



- పగిడిరాయి వైద్యాధికారి హరిత

**తుగ్గలి, మార్చి 9 (ఆంధ్రజ్యోతి):** వేసవిలో వడదెబ్బకు గురి కాకుండా జాగ్రత్తగా ఉండాలని వైద్యాధికారి హరిత సూచించారు.

**ప్రశ్న:** వేసవిలో దీర్ఘకాలిక రోగులు ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి?

**జవాబు:** దీర్ఘకాలిక రోగులు ఉదయం, సాయంత్రం మాత్రమే బయటకు రావాలి. ప్రతి నెలా వైద్య పరీక్షలు చేయించుకోవాలి.

**ప్రశ్న:** పగిడిరాయి వైద్యశాలలో కాన్పులు చేస్తున్నారా?

**జవాబు:** సాధారణ కాన్పులు చేస్తున్నాము. సిజేరియన్‌కు అవసరమైన వారికి పత్తికొండ, గుత్తి వైద్యశాలకు రెఫర్ చేస్తున్నాం.

**ప్రశ్న:** గర్భిణులు, బాలింతలకు చికిత్స చేస్తున్నారా..?

**జవాబు:** గర్భిణులు, బాలింతలకు వారానికి రెండుసార్లు వైద్యపరీక్షలు చేస్తాం. అవసరమైన వారికి మందులు ఇస్తున్నాం. మెరుగైన వైద్యచికిత్సలు అవసరమైతే వారిని అన్ని సదుపాయాలు ఉన్న వైద్యశాలకు తరలిస్తాం.

**ప్రశ్న:** వడదెబ్బకు గురైన వారికి చికిత్సలు ఏమిటి?

**జవాబు:** చల్లటి ప్రదేశంలోకి తీసుకెళ్లి, గాలి, వెలుతురు ఉండేలా చూడాలి. మజ్జిగ, నిమ్మరసం ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందిస్తూ అందుబాటులోని వైద్యశాలలో చేర్పించాలి.

**ప్రశ్న:** వడదెబ్బకు గురి కాకుండా ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి?

**జవాబు:** వడదెబ్బకు గురైనవారు అత్యవసర పరిస్థితుల్లో తప్ప బయటకు రాకూడదు. ఉదయం, సాయంత్రం వేళల్లో మాత్రమే పనులు చేసుకోవాలి. చిన్న పిల్లలు, వృద్దులు ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఆరుబయట తిరగవద్దు.

**ప్రశ్న:** సీజనల్ వ్యాధులకు ఏ విధమైన చికిత్స ఇస్తారు?

**జవాబు:** వేసవిలో వాతావరణ మార్పుల వల్ల ఫ్లూ జ్వరాలు వచ్చే అవకాశం ఉంది. ఎండ వేడిమికి చర్మవ్యాధులు కూడా వచ్చే అవకాశం ఉంది. ప్రతి రోజు ఉదయం సాయంత్రం స్నానం చేయాలి. జ్వరాలు వస్తే వెంటనే వైద్యశాలకు రావాలి. ప్రభుత్వ వైద్యశాలలో అన్ని రోగాలకు చికిత్సలు అందుబాటులో ఉంటాయి.

## టీడీపీలో బీసీలకు పెద్దపీట


బీటీ నాయుడుకు పుష్పగుచ్ఛం ఇచ్చి అభినందిస్తున్న వీరేష్

**కోసిగి, మార్చి 9 (ఆంధ్రజ్యోతి):** ఎమ్మెల్సీ అభ్యర్థులలో రెండోసారి వాల్మీకి, బోయ సామాజిక వర్గానికి చెందిన బీటీ నాయుడుకు అవకాశం కల్పించి బీసీలకు పెద్ద పీట వేసిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్‌కు ప్రత్యేక ధన్యవాదాలు తెలుపుతున్నామని టీడీపీ జిల్లా లీగల్ సెల్ జిల్లా ఉపాధ్యక్షుడు బీ.వీరేష్ అన్నారు. ఆదివారం ఎమ్మెల్యే కోటా, ఎమ్మెల్సీ అభ్యర్థుల పేర్లను టీడీపీ ఖరారు చేసింది. కర్నూలు జిల్లాలోని మంత్రాలయం నియోజకవర్గం కోసిగి మండల పరిధిలోని జుమాలదిన్నె గ్రామానికి చెందిన బీటీ నాయుడును రెండోసారి ఎమ్మెల్సీగా ప్రకటించడం హర్షణీయమన్నారు. ఎమ్మెల్సీ అభ్యర్థి బీటీ నాయుడుకు పుష్పగుచ్ఛం ఇచ్చి టీడీపీ లీగల్ సెల్ జిల్లా ఉపాధ్యక్షులు వీరేష్ శుభాకాంక్షలు తెలిపారు. మంత్రాలయం నియోజకవర్గం కోసిగి, జుమాలదిన్నె గ్రామాల ప్రజలు, టీడీపీ నాయకులు, కార్యకర్తలు హర్షం వ్యక్తం చేశారు.

## నవరత్నాల రథంపై ప్రహ్లాదరాయలు


నవరత్నాల రథంపై ఊరేగుతున్న ప్రహ్లాదరాయలు

**మంత్రాలయం, మార్చి 9(ఆంధ్రజ్యోతి):** రాఘవేంద్ర స్వామి మఠంలో ఉత్సవమూర్తి ప్రహ్లాదరాయలు నవరత్నాల రథంపై భక్తులకు దర్శనం ఇచ్చారు. ఆదివారం దశమి పర్వదినాన్ని పురస్కరించుకుని మఠం పీఠాధిపతి సుబుధేంద్ర తీర్థులు ఆశీస్సులతో బృందావనానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం నుంచి రాఘవరాయుడికి విశేష పంచామృతాభిషేకం నిర్వహించి స్వర్ణ కవచంతో చూడముచ్చటగా అలంకరించారు. వేద పండితుల మంత్రోచ్ఛరణాలు, మంగళ వాయిద్యాల మధ్య నవరత్నాల రథంపై ప్రహ్లాదరాయలను అధిష్టించి ఆలయ ప్రాంగణం చుట్టూ ఊరేగించారు. అనంతరం ఊంజలసేవ నిర్వహించారు.

## మంత్రాలయంలో భక్తుల కోలాహలం



రాఘవేంద్ర స్వామి దర్శనార్థం వచ్చిన భక్తులతో కోలాహలంగా మారింది. ఆదివారం సెలవు దినం, దశమి కావటంతో దక్షిణాది రాష్ట్రాలనుంచి వే లాది మంది భక్తులు తరలివచ్చారు. దీంతో మఠం ప్రాంగాణం భక్తులతో కిక్కిరిసింది. రెండవ శని, ఆదివారం రావడంతో మఠం అతిథి గృహాలు, ప్రైవేట్ లాడ్జీలు భక్తులతో నిండిపోయాయి. అద్దె రూములు దొరకక మధ్వమార్గ్ కారిడార్ ముందే భక్తులు బసచేశారు. అన్నపూర్ణ భోజనశాల, మహాముఖ ద్వారం, ప్రధాన రహదారులు, రాఘవేంద్ర సర్కిల్, నదితీరం భక్తులతో కోలాహలంగా మారింది. గ్రామదేవత మంచాలమ్మను దర్శించుకొని రాఘవేంద్ర స్వామి మూల బృందావనానికి ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. క్యూలైన్‌లు, పరిమళప్రసాదం వద్ద భక్తుల సందడిగా మారింది.

## నేడు ఏకాదశి.. పూజలు బంద్

**మంత్రాలయం, మార్చి 9(ఆంధ్రజ్యోతి):** రాఘవేంద్రస్వామి మఠంలో సోమవారం ఏకాదశిని పురస్కరించుకొని బృందావనానికి నిత్యం జరిగే అభిషేకాలు, అలంకరణ, నిత్య అన్నదానం, రథోత్సవాలు ఊరేగింపు బంద్ చేశారు. పీఠాధిపతులు సుబుధేంద్ర తీర్థుల ఆధ్వర్యంలో కేవలం బృందావనానికి నిర్మల విసర్జనం, క్షీరాభిషేకం నిర్వహించి మూలరాములకు పూజలు చేసి మహా మంగళ హారతులు ఇస్తారు. రాఘవేంద్రస్వామి నిజ బృందావనాన్ని భక్తులు దర్శించుకొనే అవకాశం మాత్రమే మఠం అధికారులు కల్పించనున్నారు.

## ఈవ్ టీజర్లపై చర్యలు

**కర్నూలు క్రైం, మార్చి 9 (ఆంధ్రజ్యోతి) :** జిల్లాలో ఈవ్ టీజింగ్‌కు పాల్పడేవారిపై పోలీసులు కొరడా ఝుళిపించారు. జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఆదేశాల మేరకు జిల్లా వ్యాప్తంగా 36 టీములు వారం రోజులుగా పాఠశాలలు, కళాశాలల వద్ద తనిఖీలు చేశారు. విద్యార్థినులు, యువతుల పట్ల అసభ్యంగా ప్రవర్తించే 2,818 ఈవ్ టీజర్లకు స్టేషన్‌కు పిలిపించి కౌన్సెలింగ్ ఇచ్చారు. ఈవ్ టీజింగ్‌ను అరికట్టేందుకు ఈవ్ టీజింగ్ బీట్‌ను కొత్తగా అమలులోకి తీసుకువచ్చామని సంబంధిత సీఐలు తెలిపారు. ఈవ్ టీజింగ్‌ను అరికట్టేందుకు కొత్తగా డ్రోన్ కెమెరాలను కూడా వినియోగిస్తున్నామన్నారు. ఆకతాయిల ఇబ్బందులు ఎదురైతే వెంటనే పోలీసుల దృష్టికి తీసుకురావాలని వివరించారు. అలాగే పాఠశాలలు, కళాశాలలోనూ అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

# మురుగు చెంత బతుకు చింత!


వగరూరులో రోడ్లపై ప్రవహిస్తున్న మురుగునీరు

మంత్రాలయం మండలంలోని గ్రామాల్లో ఎక్కడ చూసినా మురుగు దర్శనమిస్తోంది. దీంతో దోమలు వృద్ధి చెంది రోగాల బారిన పడుతున్నామని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్రామాల్లో డ్రైనేజీలు సక్రమంగా లేకపోవడం, ఉన్న వాటిని శుభ్రం చేయకపోవడంతో మురుగునీరంతా రోడ్లపైన, ఇళ్ల మధ్యన నిల్వ ఉంటోంది. చాలా గ్రామాల్లో సీసీ రోడ్లు కూడా లేవు. డ్రైనేజీలు నిర్మించాలని అనేక సార్లు అధికారులను, ప్రజాప్రతినిధులను కోరినా ప్రయోజనం లేదని ప్రజలు పేర్కొంటున్నారు.

● రోడ్లపైనే మురుగు నీరు
● కంపు కొడుతున్న గ్రామాలు


చెట్నహళ్లిలో మురుగు కాల్వలో చెత్తాచెదారం

**మంత్రాలయం, మార్చి 9 (ఆంధ్రజ్యోతి):** మండలంలోని వగరూరు, మాలపల్లి, వి.తిమ్మాపురం, సూగూరు, బూదూ రు, చిలకలదోణ, రచ్చమర్రి, కల్లుదేవకుంట తదితర గ్రామాల్లో అపరిశుభ్రత నెలకొంది. గ్రామాల్లో ఎటు చూసినా రోడ్లకిరువైపులా చెత్తాచెదారం నిండిపోయింది. మురుగు కాలువలను శుభ్రం చేసే వారే కరువయ్యారు. మురుగుకాలువల్లో చెత్తాచెదారం నిండిపోయి రోడ్లపై మురుగు ప్రవహిస్తుండటంతో గ్రామస్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గ్రామాలన్ని శుభ్రంగా ఉంచాల్సిన గ్రామ కార్యదర్శులు గ్రామం వైపు కన్నెత్తి చూడడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. వగరూరు జడ్పీ ఉన్నత పాఠశాల, ప్రాథమిక పాఠశాల, దర్గా సమీపంలో, ఎస్సీ కాలనీకి వెళ్లే రోడ్డులో చెత్తాచెదారంతో నిండిపోయింది. దీనికి తోడు పందులు, కుక్కలు మురుగు కాలువలో దొర్లుతుండటంతో దుర్వాసన, దోమలతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు స్పందించి గ్రామంలో నెలకొన్న అపరిశుభ్రతను తొలగించాలని గ్రామస్థులు కోరుతున్నారు.


కంపు కొడుతున్న మురుగు


వగరూరులో గ్రామంలో రోడ్లపైనే చెత్త

### ● పారిశుధ్య పనులు చేపడతాం



గ్రామంలో చెత్తాచెదారాన్ని తొలగించి పరిశుభ్రంగా ఉంచేందుకు త్వరలో చర్యలు తీసుకుంటాం. గ్రామస్థులు చెత్తాచెదారాన్ని, వాటర్ ప్యాకెట్లు, ప్లాస్టిక్ కవర్లను మురుగు కాలువలోనే పారవేస్తుండటంతో నెల తిరగకముందే కాలువలు నిండిపోయి రోడ్లపై ప్రవహిస్తున్నాయి. గ్రామస్థులు సహకరిస్తేనే పరిసరాలు శుభ్రంగా ఉంటాయి. ఉన్న నిధులతో పలు వీధుల్లో తాగునీటి పైపులైన్ వేయించాం. దాంతో పారిశుధ్య పనులు చేపట్టలేకపోయాం.

**- కురువ లింగారెడ్డి, సర్పంచ్, వగరూరు**

### గ్రామాలను శుభ్రంగా ఉంచుతాం



గ్రామాలను శుభ్రంగా ఉంచుతాం. చెత్తాచెదారంతో అపరిశుభ్రంగా ఉంచిన గ్రామ కార్యదర్శులపై చర్యలు తీసుకుంటాం. ప్రతివారం జరిగే సమావేశంలో అపరిశుభ్రంగా ఉండే గ్రామాలను శుభ్రంగా ఉంచాలని సర్పంచులను కలిసి పారిశుధ్య పనులు నిత్యం జరిగే విధంగా చూసుకోవాల్సిన గ్రామ కార్యదర్శులపైనే ఉందన్నారు. అవసరమైన నిధులు ఉన్నాయని, గ్రామంలో చెత్తాచెదారాన్ని తొలగించి ప్రజలకు ఆహ్లాదకరమైన వాతావారణన్ని కల్పించేందుకు కృషి చేస్తాం.

**- ప్రభావతి దేవి, ఈవోఆర్‌డీ మంత్రాలయం**

## ఆర్అండ్‌బీ ప్రధాన రోడ్డు ధ్వంసం

● పంచాయతీ అధికారుల సహకారంతో ప్రైవేటు వ్యక్తుల పన్నాగం
● పట్టించుకోని ఆర్ అండ్ బీ అధికారులు


కోసిగిలోని ప్రధాన సర్కిల్‌లో మెయిన్ ఆర్అండ్‌బీ రోడ్డును మిషన్‌తో కట్ చేస్తున్న ప్రైవేటు వ్యక్తులు

**కోసిగి, మార్చి 9 (ఆంధ్రజ్యోతి):** కోసిగిలోని బెళగల్, ఎమ్మిగనూరు వెళ్లే ప్రధాన రోడ్డును కోసిగి మేజర్ పంచాయతీ అధికారులు పర్మిషన్ ఇచ్చారని చెప్పి కొందరు ప్రైవేటు వ్యక్తులు ధ్వంసం చేస్తున్నారు. ఆర్అండ్‌బీ అధికారుల నుంచి ఎలాంటి పర్మిషన్ లేకుండా యథేచ్ఛగా ప్రధాన కూడలిలో మెయిన్ రోడ్డును ఇలా ధ్వంసం చేయడం ఏమిటని ప్రధాన సర్కిల్‌లోని దుకాణదారులు, వాహనదారులు, ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కోసిగిలో ఆర్అండ్‌బీ రోడ్లను ఎక్కడ పడితే అక్కడా ఎలాంటి పర్మిషన్ లేకుండా కొందరు ప్రైవేటు వ్యక్తులు పంచాయతీ అధికారుల పేర్లు చెప్పి ధ్వంసం చేస్తున్నప్పటికీ ఆర్అండ్‌బీ అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని, ఆ గుంతల వల్ల రోడ్డు ప్రమాదాలు నిత్యం జరుగుతున్నా కూడా అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. ఇదే విషయాన్ని కోసిగి మేజర్ పంచాయతీ కార్యదర్శి తిరుమలేశ్వరరెడ్డిని వివరణ కోరగా.. కొళాయిలు వేసుకోవడానికి ఓ వ్యక్తి రోడ్డును పగులకొడుతున్నట్లు తమకు చెప్పిన మాట వాస్తవమేనన్నారు.

## ప్లాస్టిక్ నిషేధం ప్రకటనలకే పరిమితం

● యథేచ్ఛగా ప్లాస్టిక్ కవర్ల విక్రయం
● పట్టించుకోని అధికారులు


గంజహళ్లి గ్రామ శివారులో ప్లాస్టిక్ వ్యర్థాలు

**గోనెగండ్ల, మార్చి 9(ఆంధ్రజ్యోతి):** కొన్నేళ్లుగా ప్రభుత్వం ప్లాస్టిక్ వస్తువులను, బ్యాగ్, గ్లాస్‌లను నిషేధిస్తున్నట్లు ప్రకటించింది . అయితే అవి కేవలం ప్రకటనలకే పరిమితమయ్యాయి. నిబంధనలు అమలు చేయడం ఆయా సంబంధిత అధికారులు మరిచారనే విమర్శలు ఉన్నాయి. గ్రామాల్లో, పట్టణ ప్రాంతాల్లోని జాతర్లు, ఉరుసులు, దేవర కార్యక్రమాలలో యథేచ్ఛగా ప్లాస్టిక్ వస్తువుల విక్రయాలు జోరుగా సాగుతున్నాయి. గ్రామీణ ప్రాంతాల్లో ప్లాస్టిక్ వస్తువుల వాడకల ఎక్కువగా ఉంటుంది. వాటికి వాడటం అక్కడే పారవేసి వెళ్లడం వల్ల వాతావరణం కాలుష్యంగా మారిపోతుంది. గ్రీన్ ట్రిబ్యునల్ ఆదేశాలను పాటించాలని అధికారులు అప్పుడప్పుడు నామమాత్రపు తనిఖీలు చేస్తున్నారే కానీ క్షేత్రస్థాయిలో కట్టడి జరగడం లేదు.

### ప్లాస్టిక్ మేనేజ్‌మెంట్ రూల్స్ ఇలా:

ఇక ప్లాస్టిక్ మేనేజ్‌మెంట్ రూల్స్ ప్రకారం పట్టణ, గ్రామీణ పరిధిలో 50 మైక్రాన్‌ల కన్న ఎక్కువ సామర్థ్యం కలిగిన ప్లాస్టిక్ కవర్లు వినియోగించాలంటే హోల్‌సేల్, రిటైల్ స్ట్రీట్ వెండర్స్ ప్లాస్టిక్ మేనేజ్‌మెంట్ రుసుము కింద నెలకు రూ. 4వేలు లేదా ఏడాదికి రూ. 48వేలు చెల్లించి ప్రభుత్వ అధికారుల అనుమతి తీసుకోవాల్సి ఉంటుంది. అనుమతి లేకుండా ప్లాస్టిక్ కవర్లు తయారు చేసినా విక్రయించినా మొదటి విడతా రూ. 50వేలు అపరాధ రుసుము విధిస్తారు. సంబంధిత వ్యాపారి ట్రేడ్ లైసెన్స్ కూడా రద్దు చేస్తారు. పౌరులు ప్లాస్టిక్ కవర్లు అమ్మినా వినియోగించినా మొదటి విడతగా రూ. 2,500 నుంచి రూ. 5వేల వరకు జరిమాన విధిస్తారు. బహిరంగ ప్రదేశాల్లో 50 మైక్రాన్‌ల కన్న తక్కువ మందం కలిగిన ప్లాస్టిక్ కవర్లు ఉపయోగిస్తే రూ. 250 నుంచి రూ. 500 వరకు అపరాధ రుసుము విధిస్తారు. అయితే క్షేత్రస్థాయిలో మాత్రం ఇవన్నీ అమలుకు నోచుకోవడం లేదు. ఇప్పటికైనా ప్లాస్టిక్ కవర్లు నిషేదంపై అధికారులు కఠినంగా వ్యవహరించాల్సింది.

## నేడు జంపాపురంలో బసవేశ్వరస్వామి రథోత్సవం


ముస్తాబైన బసవేశ్వరస్వామి రథోత్సవం

**కోసిగి, మార్చి 9 (ఆంధ్రజ్యోతి):** మండలంలోని జంపాపురం గ్రామంలో వెలసిన బసవేశ్వరస్వామి రథోత్సవాన్ని సోమవారం అంగరంగ వైభవంగా నిర్వహించనున్నారు. ఆదివారం ఆలయ అర్చకుడు ఈశ్వరయ్య ఆలయ ధర్మకర్త సీతారామిరెడ్డి, మాజీ సర్పంచ్ బసప్ప మాట్లాడుతూ గ్రామంలోని బసవేశ్వరస్వామి ఆలయంలో రెండు రోజులుగా ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సోమవారం సాయంత్రం 5 గంటల నుంచి 6 గంటల మధ్యలో అశేష జనవాహిని మధ్య స్వామి వారి రథోత్సవ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఉదయం నుం చే బసవేశ్వరస్వామికి, మల్లికార్జున స్వామికి, సుంకులమ్మ దేవికి ప్రత్యేక పూజలు చేస్తున్నట్లు తెలిపారు. బసవేశ్వరునికి ప్రత్యేక పుష్పాలంకరణతో ముస్తాబు చేశారు. అలాగే రథాన్ని పూలమాలలతో ముస్తాబు చేశారు. రథోత్సవంలో పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశామని సీఐ మంజునాథ్, ఎస్ఐ, చంద్రమోహన్ తెలిపారు. ఉత్సవాల్లో ఎవరైనా అల్లర్లకు పాల్పడితే.. కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.


పూజలందుకుంటున్న బసవేశ్వరస్వామి


బసవేశ్వరస్వామి ఆలయం

## రమణీయం.. గురు సుబ్బారుడ స్వామి రథోత్సవం


రథాన్ని లాగుతున్న భక్తులు

**కోసిగి, మార్చి 9 (ఆంధ్రజ్యోతి):** మండల కేంద్రమైన కోసిగిలోని డి.బెళగల్ రోడ్డు రంగప్ప కొండ వద్ద వెలసిన గురు సుబ్బారుడ స్వామి మహారథోత్సవం ఆదివారం అశేష భక్త జనవాహిని మధ్య రమణీయంగా సాగింది. ఉదయం నుంచి స్వామివారికి, మల్లికార్జున స్వామికి పంచామృతాభిషేకం, ఆకుపూజ, ప్రత్యేక పుష్పాలంకరణ పూజలు చేశారు. ఆలయ ధర్మకర్తలు భోంపల్లి మఠం చంద్రయ్య, బొంబాయి దయ ఆధ్వర్యంలో స్వామివారికి ప్రత్యేక పూజలు చేసి అనంతరం సాయంత్రం స్వామి రథోత్సవం అశేష భక్త జనవాహిని మధ్య కమనీయంగా సాగింది. వేడుకల్లో గొరవయ్యలు ఆట పాటలతో అలరించారు. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు హాజరై స్వామివారిని దర్శించుకున్నారు. రథోత్సవంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎస్ఐ చంద్రమోహన్ పోలీసు బందోబస్తు నిర్వహించారు. భక్తులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు.


రథోత్సవంలో గొరవయ్యల సందడి


వృక్షాలను నరికిన దృశ్యం

ఏర్పాటు చేయబోయే చిన్న ట్రాన్స్‌ఫార్మర్

## అయ్యో.. పాపం..

● చిన్నపాటి ట్రాన్స్‌ఫార్మర్ కోసం..
● ఏళ్లనాటి వృక్షాలు నరికివేత

**ఎమ్మిగనూరు రూరల్, మార్చి9(ఆంధ్రజ్యోతి):** వృక్షోరక్షిత రక్షితహః అంటారు.. ప్రతి ఒక్కరు ఓ మొక్కను నాటి పెంచాలని ప్రతిజ్ఞ చేయిస్తారు ప్రభుత్వ అధికారులు.. ఇందుకోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్నో కోట్ల రూపాయలను సైతం వెచ్చించి మొక్కలను పెంచే కార్యక్రమాలను చేపడుతోంది. అయితే మాటలకే పరిమితం అవుతున్నాయన్నదానికి ఈ సంఘటనే నిదర్శనంగా నిలుస్తోంది.. ఎమ్మిగనూరు మండలంలోని బనవాసి అటవీ ప్రాంతంలో ఉన్న ఫారంలోని ఘనీకృత వీర్య ఆబోతు కేంద్రంలో ఎన్నో ఏళ్లుగా ఉన్న వృక్షాలను ఓ చిన్న ట్రాన్స్‌పార్మర్ ఏర్పాటు చేసేందుకు నరికివేయడంతో పర్యావరణ ప్రేమికులు అధికారుల తీరుపై మండిపడుతున్నారు. ఓ మొక్క వృక్షంగా మారేందుకు ఏళ్ల సమయం పడుతుందని.. అలాంటింది వృక్షాలను కేవలం గంటల వ్యవధిలోనే నరికివేయడం ఏమిటని ప్రశ్నిస్తున్నారు. ఈ విషయంపై వీర్య ఆబోతు కేంద్రం, బనవాసి(సెమెన్‌బ్యాంకు) అధికారినిని వివరణ కోరేందుకు ప్రయత్నించగా అందుబాటులోకి రాలేదు. అలాగే అటవీశాఖ (ఆర్ఎఫ్‌వో, ఆదోని) అధికారిణి తేజశ్వనిని వివరణ కోరగా పరిశీలించి చర్యలు తీసుకుంటామన్నారు.